Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 220 మేడ్చల్ మల్కాజ్‌గిరి 30 ఆగస్టు 2023 బుధవారం పేజీలు : 4

## మదుపర్ల ప్రయోజనాలపై సుప్రీంకోర్టు ఆందోళన!

న్యూఢిల్లీ : భారతీయ మదుపర్ల ప్రయోజనాల పరిరక్షణపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. స్టాక్‌మార్కెట్‌పై నియంత్రణకు పటిష్ఠ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం, సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా)కి సూచించింది. అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ నివేదిక ఇవ్వడంతో మార్కెట్‌లో ఆ కంపెనీ షేర్ విలువ హఠాత్తుగా పతనమైందని, దీంతో అమాయకులైన మదుపర్లు భారీగా నష్టపోయారని.. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. రెండు వారాలుగా జరిగిన పరిణామాల వల్ల భారతీయ మదుపర్లు భారీగా నష్టపోయారని పేర్కొంది. రూ.10 లక్షల కోట్లకు పైగా నష్టం జరిగిందన్న వార్తలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది.




# 'పూర్వవైభవం'

## అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సేనా!

## అవునంటూ బల్లగుద్ది చెబుతున్న సర్వే సంస్థలు!!

హైదరాబాద్ : తెలంగాణలో మరొక్క మూడు నెలల్లో అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్న వేళ.. రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఇప్పటికే అధికార బీఆర్ఎస్ 95 శాతం అభ్యర్థులను ప్రకటించేసింది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. బీజేపీ కూడా త్వరలో జాబితా విడుదల చేసే ప్రయత్నాల్లో ఉంది. అయితే, ఇప్పటివరకు పెద్దగా చర్చల్లోకి రాని అంశం.. ఓటరు మొగ్గు ఎటువైపు ఉన్నదనేదే? వాస్తవానికి లోక్ సభ ఎన్నికలకు ఇంకా ఎనిమిది నెలల సమయం ఉంది. వీటికి ముందుగా తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ వంటి పెద్ద రాష్ట్రాల్లో అసెంబ్లీకి ఎన్నికలున్నాయి. వీటిలో రాజస్థాన్ ఛత్తీస్ గఢ్ లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. మధ్యప్రదేశ్ లో రెండేళ్ల కిందట కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చిన బీజేపీ అధికారం చేపట్టింది. మిగిలింది తెలంగాణ.. ఇక్కడ రెండు దఫాలుగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) గెలుస్తూ వస్తోంది. వరుసగా మూడోసారి కూడా గెలుపు తమదే అని అంటోంది. లోక్ సభ ఎన్నికలకు ముందు ఈ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను సెమీఫైనల్స్ గా భావిస్తున్నారు. ఇక్కడ నెగ్గితే.. లోక్ సభ ఎన్నికలకు ధీమాగా వెళ్లవచ్చు. మెజార్టీ రాష్ట్రాల్లో నెగ్గితే.. బీజేపీ ఆ ఫలితాన్ని ప్రధాని మోదీ పాలనకు దక్కిన ప్రతిఫలంగా చెప్పుకొంటుంది. ఒకవేళ కాంగ్రెస్ గెలిస్తే అగ్ర నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర, మోదీ పాలనపై ఉన్న వ్యతిరేకతకు ఈ ఫలితాలు ప్రతిబింబమని ప్రచారం చేసుకుంటుంది.

**తెలంగాణలోనే పోరు భిన్నం** : రాజస్థాన్, మధ్యప్రదేశ్‌బీ ఛత్తీస్ గఢ్ ఈ మూడు చోట్ల పోటీ కాంగ్రెస్ –బీజేపీ మధ్యనే ఉంది. తెలంగాణలో మాత్రం బీఆర్ఎస్– కాంగ్రెస్ మధ్య హోరాహోరీ నెలకొంది. పైకి హడావుడి చేస్తున్నా.. బీజేపీకి మూడో స్థానం మాత్రమే అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

అయితే, కొన్ని సీట్లలో మాత్రం త్రిముఖ పోరు తప్పదు. అలాంటిచోట గెలుపెవరిది అనేది పరిస్థితులను బట్టి బేరీజు వేయాల్సి ఉంటుంది.

**సర్వేలో ఏపీలో అలా.. తెలంగాణలో ఇలా..** లోక్ సభ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ లో టీడీపీదే పై చేయి అని ఇటీవల ఇండియా టుడే–సీ వోటర్ సర్వే తెలిపింది. అయితే, తెలంగాణలో మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య నే హోరాహోరీ పోరు సాగుతుందని తేల్చింది.

చివరకు కాంగ్రెస్ కే మొగ్గు ఉంటుందని పేర్కొంది. కాగా, తెలంగాణ లోని 17 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ కు 7, బీఆర్ఎస్ కు 5, బీజేపీకి 4 సీట్లు దక్కుతాయని వివరించింది. ఎంఐఎం ఎప్పటిలాగే హైదరాబాద్ సీటును నిలుపుకొంటుందని స్పష్టం చేసింది.

**ఓట్ల శాతం ఇలా...** ఇండియా కూటమిలో ప్రధాన పార్టీ కాంగ్రెస్ . కాంగ్రెస్ కు లోక్ సభ ఎన్నికల్లో ఏపీలో కేవలం 2% ఓట్లే వస్తాయని సీ ఓటర్ సర్వే తెలిపింది. కానీ, తెలంగాణలో 38% ఓట్లు లభిస్తాయని సర్వేలో వెల్లడైంది. తెలంగాణ అధికార పార్టీ బీఆర్ఎస్ కు కాంగ్రెస్ కంటే 6 శాతం తక్కువగా 32% ఓట్లు.. 5 సీట్లు మాత్రమే వస్తాయని సీ ఓటర్ సర్వే తెలిసింది.

**బీఆర్ఎస్‌కు తగ్గి కాంగ్రెస్, బీజేపీలకు లబ్ధి :** తెలంగాణలో లోక్ సభ ఎన్నికలకు వచ్చేసరికి బీజేపీని తక్కువ అంచనా వేయక్కర్లేదని.. ఆ పార్టీకి 23% ఓట్లతో 4 సీట్లు లభిస్తాయని సర్వేలో వెల్లడైంది. కాగా, 2019ఎన్నికల్లో బీఆర్ఎస్ కు 41.71% ఓట్లు వచ్చాయి. 2024 నాటికి ఈ ఓట్లు దాదాపు 10% తగ్గనున్నట్లు సీ ఓటర్ సర్వే చెబుతోంది. కానీ కాంగ్రెస్ ఓట్లు 29.79% నుంచి 38శాతానికి పెరగుతాయని స్పష్టం చేసింది. బీజేపీకి 2019లో 19.65% ఓట్లు రాగా.. ఈసారి 4% మేర పెరుగుతాయని లెక్కేసింది. అంటే.. బీఆర్ఎస్ తప్ప బీజేపీ, కాంగ్రెస్ ఓట్ల శాతం పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది.

**కాంగ్రెస్ పెద్ద పార్టీ..** సీ ఓటర్ సర్వే ప్రకారం కాంగ్రెస్ కు 7 లోక్ సభ స్థానాలు దక్కుతాయి. ఒక్కో పార్లమెంటు సీటులో ఏడు శాసన సభ స్థానాలుంటాయి. ఈ లెక్కన శాసన సభ స్థానాలను తీసుకుంటే కాంగ్రెస్ కు అసెంబ్లీ ఎన్నికల్లో 49 సీట్లు వస్తాయని భావించవచ్చు. బీఆర్ఎస్ 35, బీజేపీ 20 సీట్లు గెలుస్తాయని అంచనా కట్టొచ్చు. అంటే తెలంగాణలో అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్ ఆవిర్భవించనుంది. మొత్తానికి వరుసగా రెండుసార్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కు ఈ ఎన్నికలు క్లిష్టమైనవిగా మారుతున్నాయని, ప్రజాబలం తగ్గుతున్నదనడానికి సంకేతాలు కనిపిస్తున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. లోక్ సభ ఎన్నికలకు 8 నెలల సమయం ఉంది.

ఎన్నికలు మొదలయ్యాక పరిస్థితిలో మార్పు వచ్చి బీఆర్ఎస్ ఓట్ల శాతం మరింత తగ్గి, కాంగ్రెస్ పుంజుకునే అవకాశాలు లేకపోలేదని అంచనా వేస్తున్నారు.

## కేసీఆర్ నాయకత్వంలో చేనేత పరిశ్రమ బలోపేతం



నిజామాబాద్: సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేనేత పరిశ్రమ బలోపేతం అవుతుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మంగళవారం నాడు నిజామాబాద్‌లో నిర్వహించిన పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనంలో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... ప్రభుత్వానికి ప్రజలకు మధ్య కులసంఘాలు వారధిగా ఉండాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గణేష్‌గుప్తాకు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో శాంతిభద్రతలకు ఢోకా లేదన్నారు. కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటు వస్తుందని చెప్పారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ పాలన చేస్తున్నరన్నారు. చేనేత పరిశ్రమను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. చేనేత మీద ప్రధాని మోదీ పన్ను వేశారని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు.

## మంచిర్యాల బీఆర్ఎస్‌లో అసమ్మతి.. అభ్యర్థిని మార్చకుంటే ఓడిస్తామని హెచ్చరిక..




బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించినప్పటి నుంచి పలుచోట్ల అసమ్మతి వ్యక్తం అవుతోంది. తాజాగా మంచిర్యాల బీఆర్ఎస్ లో అసమ్మతి తారాస్థాయికి చేరింది. మంచిర్యాల గులాబీ పార్టీ అభ్యర్థిని మార్చాలని మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్ రెడ్డి కోరారు. లేకుంటే బీఆర్ఎస్ కు ఓటమి తప్పదని హెచ్చరించారు. వారం రోజుల్లో అభ్యర్థిని మార్చకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వార్నింగ్ ఇచ్చారు. మంచిర్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ ను సిట్టింగ్ ఎమ్మెల్యే దివాకర్ రావు కు ఇచ్చారు. అయితే దివాకర్ రావు టికెట్ రావడంపై అరవింద్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాలలోని తన నివాసంలో అనుచరులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలువురు బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు హాజరయ్యారు. ఉద్యమ సమయంలో పార్టీని ముందుండి నడిపించిన అరవింద్ రెడ్డికి టికెట్ ఇవ్వకపోవడంపై కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టికెట్ ఇవ్వని పక్షంలో స్వతంత్ర అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించుకుంటామన్నారు. దివాకర్ రావు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలేదని అరవింద్ రెడ్డి అన్నారు. నియోజకవర్గాన్ని పదేళ్లు వెనక్కు తీసుకెళ్లారని విమర్శించారు. మిషన్ భగీరథ నిరూపయోగంగా మారిందన్నారు. మంచిర్యాలలో శ్మశానవాటిక, డంపింగ్ యార్డు కూడా లేదనన్నారు. మరోసారి దివాకర్ రావును గెలిపిస్తే మంచిర్యాల అభివృద్ధి కుంటుపడుతుందన్నారు.

మూడు పార్టీలు వెలమ సామాజిక వర్గాలకు తప్ప.. నియోజకవర్గంలో ఎక్కువగా ఉండే బీసీలకు ఎందుకు టికెట్ ఇవ్వలేదని ప్రశ్నించారు. బీసీ అభ్యర్థికి టికెట్ ఇస్తే బంపర్ మెజారిటీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. కోదాడ నియోజకవర్గంలో కూడా అసమ్మతి చెలరేగింది. నాలుగు రోజుల క్రితం బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మాజీ ఎమ్మెల్యే చందర్ రావు ఇంటికి వెళ్లారు. అయితే మల్లయ్యను కలిసేందుకు చందర్ రావు నిరాకరించారు. దీంతో మల్లయ్య యాదవ్ వెనుదిరిగారు.

# 'బండ దిగుతోంది'

## 5 రాష్ట్రాల ఎన్నికల ముందు కేంద్రం సంచలన నిర్ణయం..

న్యూఢిల్లీ: నిత్యావసరాల ధరలన్నీ గత కొద్ది నెలలుగా పెరుగుతూ పోతున్న నేపథ్యంలో మధ్యతరగతి ప్రజలకు ఒకింత ఊరట కలగనుంది. ఎల్‌పీజీ సిలెండర్ ధరను తగ్గించేందుకు కేంద్రం నిర్ణయించినట్టు సమాచారం. సిలెండర్ ధర రూ.200 మేరకు తగ్గించనుందని, రాబోయే 24 గంటల్లో కేంద్రం ఈ మేర కు కీలక ప్రకటన చేయనుందని తెలుస్తోంది. ప్రస్తుతం ఎల్‌పీజీ సిలెండర్ ధర రూ.1,100 వరకూ ఉంది. రాబోయేదంతా ఎన్నికల సీజన్ కావడం, చుక్కలనంటుతున్న నిత్యావసరాల ధరల వ్యవహారం ఎన్నికల అంశం కానుండటంతో కేంద్రం ఎల్‌పీజీ ధరల తగ్గింపు నిర్ణయాన్ని సీరియస్‌గా తీసుకున్నట్టు చెబుతున్నారు. టమోటా ధరలు ఇప్పటికీ వార్తల్లో నిలుస్తుండగా, రాబోయే రోజుల్లో ఉల్లిగడ్డల ధరలు టమోటా ధరలను మించిపోనున్నాయని బలంగా వినిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ధరలపై అదుపునకు పలు చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ధరలు తగ్గలేదనే అభిప్రాయం కూడా వినియోగదారుల్లో వ్యక్తమవుతోంది.







## భారీగా తగ్గనున్న ఎల్‌పీజీ గ్యాస్ ధర..!

**బీజేపీకి ఏమేరకు లాభం?** ఎల్‌పీజీ ధరల తగ్గించడం వల్ల త్వరలో జరగనున్న మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ ఎన్నికల్లో బీజేపీకి లాభించే అవకాశాలు ఉండవచ్చని చెబుతున్నారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ సోమవారంనాడు పలు ఎన్నికల హామీలు ఇచ్చారు. రూ.450 కే సిలెండర్ ఇస్తామన్న హామీ ఇందులో ఒకటి. శ్రావణ మాసంలో సిలెండర్ రూ.450కే ఇస్తున్నామని, 1.25 కోట్ల మంది మహిళలకు రూ.250 చొప్పున వారి అకౌంట్లకు నేరుగా వేస్తున్నామని ప్రకటించారు. తక్కిన రూ.1,000 (లాడ్లీ బెహ్నా యోజన) సెప్టెంబర్‌లో జమ చేస్తామని ప్రకటించారు.

## సంపాదకీయం

### కిరాయి సైన్యం తిరుగుబాటుతో రష్యాలో ఇప్పుడేం జరుగుతోంది?

పాలు పోసి పెంచిన పాముకు బయటవారికి.. యజమానికి తేడా తెలీదు. ఎవరినైనా ఇట్టే కాటేస్తుందంటారు. అలాంటి ఆటనే ఆడిన రష్యా అధినేత పుతిన్ కు దిమ్మతిరిగే షాక్ తగిలింది. పక్కనున్న ఉక్రెయిన్ ను సొంతం చేసుకుకోవాలన్న అత్యాశతో భారీ కిరాయి సైన్యాన్ని రంగంలోకి దించి.. తనకున్న ఆయుధ బలంతో ఆ దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేసి.. తన సొంతం చేసుకోవాలన్న భారీ ప్లాన్ ఇప్పటికే బెడిసికొట్టిన వైనం తెలిసిందే. యుద్ధం ఆరంభించిన నాలుగైదు వారాల్లో ఉక్రెయిన్ ను హస్తగతం చేసుకుంటామని భావిస్తే.. ఏడాదిన్నర కాలంగా ఉక్రెయిన్ మీద పట్టు సాధించేందుకు కిందా మీదా పడుతున్న పరిస్థితి. భరించలేని భారంగా యుద్ధం మారిన వేళ.. ముందుకు వెళ్లలేక.. వెనక్కి రాలేక కిందా మీదా పడుతున్నారు. ఇలాంటి సమయంలోనే ఏడాదిన్నరగా సొంత అస్తిత్వం కోసం పోరాడుతున్న ఉక్రెయిన్.. రష్యాకు కొత్త చిక్కులు తెస్తూ.. ఉక్రెయిన్ విషయంలో తానెంత తప్పు చేశానన్న భావాన్ని పుతిన్ కు కలిగేలా చేస్తోంది. ఇదంతా ఒక ఎత్తు అయితే.. కిరాయి సైన్యం వాగ్నర్ తో ఉక్రెయిన్ ను సొంతం చేసుకోవాలనుకున్న పుతిన్ ప్లాన్ బెడిసి కొట్టటం.. రష్యా మీద తిరుగుబాటు బావుటా ఎగురవేయటంతో షాకింగ్ పరిణామాలు చోటు చేసుకున్నాయి. దీనికి తోడు రష్యా మిలటరీ నాయకత్వాన్ని కూల్చివేస్తామని వాగ్నర్ చీఫ్ యెవ్గెనీ ప్రిగోజిన్ వార్నింగ్ ఇవ్వటంతో పాటు.. తమ బలగాలపై రష్యా సైన్యం దాడులకు పాల్పడుతోందని ప్రతీకారం తప్పదని గర్జించాడు. అంతేకాదు..రష్యాలోని ప్రధాన నగరమైన "రోస్తావ్ దాన్" తమ అధీనంలో ఉందని.. ఒక్క బుల్లెట్ పేలకుండానే తాము ఆ నగరాన్ని సొంతం చేసుకున్నట్లుగా ప్రకటించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ కు అత్యంత సన్నిహితుడైన వాగ్నర్ చీఫ్.. ఇప్పుడు అడ్డంగా ప్లేట్ ఫిరాయించటం రష్యన్లకు సైతం మింగుడుపడటం లేదు. కిరాయి సైన్యం నుంచి రష్యా తన సొంత ప్రజల్ని కాపాడుకోవాలన్న పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో మరింత కన్ఫ్యూజన్ కు గురి చేసే వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. దీంతో.. ఏది నిజమో.. ఏది అబద్ధమో అర్థం కాని గందరగోళ పరిస్థితి చోటు చేసుకుంది. ఇదిలా ఉంటే వాగ్నర్ ఛీఫ్ ను అరెస్టు చేయాలని రష్యా ప్రభుత్వం ఆదేశాలుజారీ చేసింది. దీంతో.. ఇరవై ఏళ్లుగా తనకు తిరుగులేని అధికారబలంతో దూసుకెళుతున్న పుతిన్ తొలిసారి పదవీ గండం ముప్పును ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ఈ సందర్భంలో పుతిన్ జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ.. కిరాయి సైన్యం చీఫ్ పేరును ప్రస్తావించకుండా.. వెన్నుపోటు పొడిచినట్లుగా వ్యాఖ్యానించారు. తిరుగుబాటు చేసిన వారికి కఠిన శిక్షలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. తిరుగుబాటు చేసిన వారిని ఏం చేయాలో తామిప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లుగా పుతిన్ చెప్పినప్పటికీ.. అదంత తేలికైన విషయం కాదంటున్నారు. వాగ్నర్ చీఫ్ పై క్రిమినల్ కేసును నమోదు చేశారు. ఇదిలా ఉంటే పుతిన్ స్పీచ్ తర్వాత.. వాగ్నర్ చీఫ్ ఒక ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. తమను దేశ ద్రోహులుగా పేర్కొంటూ పుతిన్ పెద్ద తప్పు చేశారన్నారు. ఉక్రెయిన్ యుద్ధంలో పోరాడిన అసలుసిసలు దేశ భక్తులం తామేనని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి లొంగేది లేదన్న ఆయన.. తన సైన్యంతో మాస్కోను ముట్టడిస్తామని పేర్కొన్నారు. రష్యా కీలకమైన రోస్తావ్ దాన్ నగరాన్ని తాము స్వాధీనం చేసుకున్నామని.. సైనిక ప్రధాన కార్యాలయం.. ఇతర సైనిక స్థావరాల్ని తమ అధీనంలో ఉన్నట్లుగా వాగ్నర్ చీఫ్ వెల్లడించారు. అంతేకాదు.. రష్యా రక్షణ మంత్రి.. మిలరటీ జనరల్ ఇద్దరూ రోస్తోవ్ లోని మిలటరీ కార్యాలయంలో తనతో సమావేశం కావాలన్నారు. తన డిమాండ్ ను నెరవేర్చకపోతే.. రాజధాని మాస్కోను ముట్టడిస్తామన్న ఆయన మాటకు తగ్గట్లే.. పాతిక వేల సైనిక బలం ఆ దిశగా బయలుదేరింది. మాస్కోకు 360కి.మీ. దూరంలో ఉన్న వాగ్నర్ బలగాలకు చెందిన వీడియోలు బయటకువచ్చాయి. తాజా పరిణామాల నేపథ్యంలో మాస్కోలో బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు గుమిగూడి ఉండే కార్యక్రమాల్ని రద్దు చేస్తున్నట్లుగా మాస్కో గవర్నర్ ఆదేశాలుజారీ చేయటంతో పాటు జులై ఒకటి వరకు స్కూళ్లకు సెలవులు ఇచ్చారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో బెలారస్ అధ్యక్షుడు రంగంలోకి దిగారు. ఆయన మధ్యవర్తిత్వంతో రష్యా- కిరాయి సైన్యం చీఫ్ కు మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినట్లుగా చెబుతున్నారు. మాస్కో లక్ష్యంగా సాగుతున్న 25వేల ప్రైవేటు సైన్యాన్ని ప్రస్తుతానికి వెనక్కి వెళ్లాలని.. రష్యన్ల రక్తం చిందకూడదన్న ఉద్దేశంతోనే తామీ నిర్ణయాన్ని తీసుకున్నట్లుగా పేర్కొన్నారు. తమ సైన్యాలనుఉక్రెయిన్ లోని స్థావరాలకు వెళ్లాల్సిందిగా సూచన చేసినట్లుగా పేర్కొన్నారు. ఇలాంటి వేళ.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ సీన్లోకి వచ్చారు. చెడు మార్గంలో పయనించేవారు తమ నాశనాన్ని తామే తెచ్చుకుంటారన్నారు. రష్యా ఇప్పుడు పూర్తిగా బలహీనమైనందని పేర్కొన్నారు. కిరాయి సైన్యాన్ని రష్యా.. తమ దేశంలో ఎంత ఎక్కువ కాలం ఉంచుకుంటుందో.. అంత ఎక్కువ బాధను పుతిన్ అనుభవిస్తారని వ్యాఖ్యానించటం గమనార్హం.

# అడగలేవని అలుసా..?



కోదాడ : ప్రభుత్వం పాడి రైతులకు గేదెలను, మాంసం ఉత్పత్తి కోసం గొర్రెలు, మేకలను పలు రకాల రాయితీలతో అందిస్తోంది. కానీ వీటి సంరక్షణకు ఏర్పాట్లు చేయకపోవడంతో వందల సంఖ్యలో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల వారికి అవగాహన కొరవడటం, వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం పశువులకు శాపంగా మారుతోంది. ఏడాదికి ఒక్కసారి గ్రామంలో నట్టల నివారణ శిబిరాల పేరిట రెండు రోజులు హడావుడి చేసి అధికారులు చేతులు దులుపుకొంటున్నారు.

**జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి..**

సూర్యాపేట జిల్లాలో 41 ప్రాథమిక పశు వైద్యశాలలు, 5 ప్రాంతీయ పశు వైద్యశాలలు, 42 ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 15 పశు వైద్య ఉపకేంద్రాల్లో సహాయకులు లేక వారానికి ఒక్కరోజే ఉపకేంద్రాలు తెరుస్తున్నారు. కొన్ని గ్రామాల్లో సిబ్బంది లేకపోవడంతో మూసి ఉంటున్నాయి.

**అవగాహన లేమి..**

ప్రభుత్వం 108 తరహాలో పశువులను వైద్యశాలలకు తరలించేందుకు సంచార పశు వైద్యశాల పేరుతో 1962 టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులోకి తెచ్చింది. దీనిపై గ్రామీణ రైతులకు అవగాహన లేదు. గ్రామీణ ప్రాంతాల్లో దీని పనితీరుపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులు, ప్రభుత్వంపై ఉంది.

**ఇబ్బందులు పడుతున్నాం..వీరబాబు, తొగర్రాయి**

వారంలో ఒక్కరోజు ఉపకేంద్రం తెరుస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పశువులు రోగాల బారిన పడినప్పుడల్లా పక్క గ్రామాలకు తీసుకెళ్తున్నాం. గ్రామంలో పశు వైద్య సహాయకులను వెంటనే భర్తీ చేసి సేవలు ప్రారంభించాలి.

**సిబ్బందిని నియమించాలివీరారెడ్డి, అడ్లూరు**

గ్రామస్థులకు పశుపోషణే జీవనాధారం. జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు తమ సమస్యను మొర పెట్టుకున్నా పట్టించుకోలేదు. సిబ్బంది లేకపోవడంతో ఏళ్ల తరబడి ఉపకేంద్రం మూసే ఉంటోంది. ఇప్పుడికైనా సమస్యను గుర్తించి గ్రామంలో సిబ్బందిని నియమించాలి.

**ఉన్నతాధికారులకు నివేదిక అందించాం..శ్రీనివాసరావు, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి**

జిల్లాలో సిబ్బంది కొరత కారణంగా 15 ఉపకేంద్రాల్లో సేవలు నామమాత్రంగా నడుస్తున్నాయి. ఉన్న సిబ్బందిపై పని ఒత్తిడి అధికమవుతోంది. పశు వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఖాళీల కొరతపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. త్వరలో ఖాళీల భర్తీ జరగనుంది.

# పెద్దల అండ.. ఆనవాళ్లే లేకుండా..!



సూర్యాపేట :చెరువులు, నీటి కుంటలు ఉన్న ప్రాంతాల్లోనే పూర్వం జనావాసాలు ఏర్పాటు చేసుకోగా..కాలగమనంలో..మానవ అభివృద్ధి క్రమంలో కబ్జాలు పెరిగిపోయి.. నీటిని నిల్వ చేసే చెరువులు, కుంటలు అదృశ్యమవుతున్నాయి. గతంలో నిత్యావసరాలు తీర్చేందుకు, పంటలు పండించేందుకు ఉపయోగపడిన చెరువులు..ప్రస్తుతం రియల్ వ్యాపారుల ఆక్రమణలతో ఆనవాళ్లు కోల్పోతున్నాయి. చెరువుల పూర్తి నీటి నిల్వ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్) నిర్ధరించినప్పటికీ ఈ మేరకు చెరువుల హద్దులు నిర్ణయించి వాటిని పరిరక్షించే విషయంలో సరైన వ్యవస్థ లేకపోవడంతో చెరువులు మాయమవుతున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లో చెరువులు, కుంటల స్థలాల్లో ఇళ్లను నిర్మించుకుంటుండగా, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పంటలు సాగు చేస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మిషన్ కాకతీయ పేరుతో చెరువులు, కుంటల పూడిక తీత పనులు చేపట్టినప్పటికీ ఆయా చెరువుల హద్దుల నిర్ణయం విషయంలో రాజకీయ జోక్యంతో అవి పూర్వ వైభవాన్ని పొందలేకపోయాయి.

**ఉమ్మడి జిల్లాలో పరిస్థితి**

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 556 నీటిచెరువులు, 4193 నీటి కుంటలు కలిపి మొత్తం 4749 చెరువులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో దశలవారీగా మిషన్ కాకతీయ కింద పూడికతీత పనులు చేపట్టారు. 2014- 15 ఏడాదికి గాను 952 చెరువుల్లో పూడికతీసి పూర్తి నీటినిల్వ సామర్థ్యం మేరకు నీరు నిల్వ ఉండేలా ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలోని 556 చెరువుల పరిధిలో 1,38,855 ఎకరాలు, నీటికుంటలు 4077 పరిధిలో 79,750 ఎకరాలు కలిపి మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4633 చెరువుల పరిధిలో 2,18,605 ఎకరాల ఆయకట్టు సాగుచేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో అటవీ శాఖ పరిధిలో 13 నీటి చెరువులు ఉన్నాయి. వీటిని అటవీశాఖ పరిరక్షిస్తుంది.

మచ్చుకు కొన్ని..మిర్యాలగూడ పట్టణం, మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామాల మధ్య విస్తరించి ఉన్న పెద్దచెరువు రామచంద్రగూడెంలో ఆక్రమణలకు గురైంది. నీటి నిల్వ సామర్థ్యం గుర్తించి హద్దులు ఏర్పాటు చేయకపోగా ఈ ప్రాంతంలో రెవెన్యూ సిబ్బంది గతంలో పలువురికి పాసుపుస్తకాలు జారీ చేశారు. దీని కారణంగా ఆక్రమణలతో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు 2016 నుంచి ఇప్పటి వరకు పూర్తి చేయలేకపోతున్నారు. కోదాడ పెద్ద చెరువునకు చెందిన స్థలాలను కొందరు వ్యక్తులు కబ్జాకు పాల్పడి నిర్మాణాలు చేపట్టారు. పురపాలిక, రెవెన్యూ, నీటిపారుదల మధ్య సమన్వయ లోపంతో ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 50 ఎకరాలకుపైగా ఆక్రమణలకు గురైనట్లు సమాచారం.నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామంలో తాటిచెరువు కొంత భాగం ఆక్రమణకు గురైంది. కొందరు వ్యక్తులు వ్యవసాయం చేసుకుంటున్నారు.సూర్యాపేటలోని సద్దుల చెరువు పరిధిలో కొందరు ఆక్రమించి నిర్మాణాలు జరిపారు. 59 జీవో ప్రకారం రెగ్యులర్ కోసం దరఖాస్తు చేసుకోగా.. దీన్ని అధికారులు పెండింగ్‌లో పెట్టారు. దేవరకొండ పురపాలిక పరిధిలోని తులసమ్మకుంటలో కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు జరిపి షెడ్లు నిర్మించారు. దీనివల్ల కుంటకు చెందిన స్థలం ఆక్రమణకు గురైంది. హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో బూరుగడ్డ, లింగగిరి చినచెరువు వంద ఎకరాలు ఉండగా.. ప్రస్తుతం కబ్జాలకు గురై ఆనవాళ్లు కోల్పోయింది. భువనగిరి పట్టణంలోని పెద్దచెరువులో ఓ పరిశ్రమ వారు రహదారి ఏర్పాటుకు మట్టితో నింపారు. మరో రియల్ ఎస్టేట్ సంస్థ ఒక అడుగు ముందుకు వేసి ఎఫ్‌టీఎల్ పరిధిలో తమ వెంచరు ఏర్పాటు చేసి విక్రయాలు జరుపుతోంది.

# అందని పరిహారం.. అన్నదాతలు ఆగం

భువనగిరి : కన్న తల్లిలాంటి ఊరు.. జీవనాధారమైన పొలాలు.. తమ ముత్తాతలు సంపాదించిన ఆస్తులు.. సర్వం కోల్పోయి... ఊరు విడిచి వెళ్లాల్సి సమయం ఆసన్నమైనా పరిహారం అందక, పునరావాస పనులు పూర్తి కాక బీఎన్ తిమ్మాపూర్ గ్రామస్థులు దయనీయ పరిస్థితుల్లో కొట్టిమిట్టాడుతున్నారు. భువనగిరి మండలం బస్వాపూర్‌లో 11.39 టీఎంసీల సామర్థ్యంతో నృసింహసాగర్ జలాశయం నిర్మితమౌతున్న విషయం విధితమే. బీఎన్ తిమ్మాపూర్‌తో పాటు చౌక్లా తండా, లప్పనాయక్ తండాలు జలాశయంలో ముంపునకు గురవుతున్నాయి. పరిహారం కోసం 57 రోజులుగా జలాశయం కట్టపైన ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం నుంచి కనీసం స్పందన లేకపోవడంతో బాధను తట్టుకోలేక ఇప్పటికే పలువురి గుండెలు ఆగాయి. మరికొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. జూపల్లి నర్సింహా అనే నిర్వాసితుడు బుధవారం గుండెపోటుతో మరణించడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. పరిస్థితులు చేజారుతున్నాయని కలెక్టర్ పమేలా సత్పత్తి ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చారు. అప్పటికప్పుడు ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి ప్రభుత్వ ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీలో పెండింగ్‌లో ఉన్న రూ.34 కోట్ల విడుదలకు అనుమతి తెచ్చారు. కానీ భూ నిర్వాసితులకు చెల్లించాల్సిన రూ.195 కోట్లు గూర్చి ఊసెత్తలేదు. బీఎన్ తిమ్మాపూర్ వాసులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి గాను భూసేకరణ చట్టం-2103 ప్రకారం 2019లో నోటిఫికేషన్ జారీ చేశారు. భువనగిరి పట్టణం హుస్నేనాబాద్‌లోని సర్వే నెంబర్ 107లోని 93 ఎకరాల్లో లే-అవుట్ తయారు చేస్తున్నారు. ఒక్కొక్కరికీ 200 చ.గజాలు ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి. సర్వే చేసిన అధికారులు 1056 మంది నిర్వాసితులు ఉన్నట్లు తేల్చారు. పరిహారం ప్యాకేజీలో భాగంగా ఒక్కొక్కరికి 200 చ.గజాల స్థలం, రూ.7.61 లక్షల నగదు ఇవ్వాలని నిర్ణయించారు. 655 మంది లబ్ధిదారులకు రూ.50 కోట్లను 2022 సెప్టెంబరు నెలలోనే చెల్లించారు. మిగిలిన 401 మందికి రూ.34 కోట్లను చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం జాప్యం చేస్తూ వచ్చింది. ఎట్టకేలకు నిధులు విడుదల చేసేందకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**తీవ్ర జాప్యం..నిర్వాసితులపాలిట శాపం**

నృసింహసాగర్ జలాశయం నిర్మాణంలో భువనగిరి మండలంతో బీఎన్ తిమ్మాపూర్, యాదగిరిగుట్ట మండలం లప్పనాయక్‌తండా(లక్ష్మీనాయక్ తండా), తుర్కపల్లి మండలం చౌక్లా తండలు మునిగిపోతున్నాయి. 2017 నుంచి భూసేకరణ పనులు కొనసాగుతున్నాయి. తిమ్మాపూర్ గ్రామానికి సంబంధించి 1090 ఎకరాలకు అవార్డు పాస్ చేసి డబ్బులు చెల్లింపు కోసం గత మే నెలలోనే జాబితా పంపించారు. రూ.194 కోట్లను చెల్లించాలి. వీటిలో 750 ఎకరాలు రైతులువి కాగా మిగిలిన 270 ఎకరాలు రియల్‌ఎస్టేట్ వ్యాపారులవి. అవార్డు పాసై ఎనిమిది నెలుల గుడుస్తున్నా ప్రభుత్వం నయాపైసా విడుదల చేయలేదు.

**వారంలో చెల్లిస్తాంపమేలా సత్పతి, కలెక్టర్‌బీఎన్ తిమ్మాపూర్**

నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకునేందకు చర్యలు తీసుకుంటున్నాం. అందరకీ న్యాయం జరిగేలా ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. రూ.34 కోట్లు రెండు రోజుల్లో జమౌతాయి. ఆ వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తాం. గ్రామస్థులు గ్రామ సభ పెట్టుకుని తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్లాట్లు కేటాయిస్తాం.

# సృజనాత్మకత.. ఉపాధికి భరోసా

జడ్చర్ల : నేడు ఉన్నత విద్య అభ్యసిస్తున్నా ఉద్యోగం దొరుకుతుందన్న భరోసా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో యూజీసీ మార్గదర్శకాల మేరకు విద్యార్థులకు చదువుతో పాటు ఉపాధి మార్గాలను చూపాలన్న లక్ష్యంతో ప్రభుత్వ కళాశాలల యాజమాన్యాలు కృషిచేస్తున్నాయి. ఇందులో భాగంగా జడ్చర్లలోని డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఓ వినూత్న కార్యక్రమం చేపట్టారు. వివాహాలు, ఇతర శుభకార్యాల సమయంలో మెహందీ కళాకారులకు చాలా డిమాండ్ ఉంటోంది. ఒక్కో వేడుకకు పనిచేసేందుకు రూ. వేలల్లో డబ్బులు తీసుకుంటున్నారు. మెహందీలో శిక్షణ ఇప్పిస్తే విద్యార్థినులకు ఆర్థికంగా ఆధారమవుతుందని ప్రిన్సిపల్ డా.అప్పియా చిన్నమ్మ, అధ్యాపకురాలు, కోర్సు సమన్వయకర్త కె.సుభాషిణి ఇందుకు శ్రీకారం చుట్టారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు నైపుణ్య అభివృద్ధిలో భాగంగా మెహందీ డిజైన్ సర్టిఫికెట్ కోర్సులో నెల రోజుల శిక్షణ ఇచ్చారు. 30 రకాల డిజైన్లను నేర్పించారు. ఈ నేపథ్యంలో పలువురు విద్యార్థినులను పలకరించింది.

**కొత్త డిజైన్లు నేర్చుకున్నా**

కళాశాల వసతి గృహంలో ఉంటూ చదువుతున్నా. మెహందీ అంటే చాలా ఇష్టం. కోర్సుతో చాలా డిజైన్లు నేర్చుకున్నా. గ్రామాలు, పట్టణాల్లో మోహందీకి మంచి డిమాండ్ ఉంది. వివాహాల్లో మోహందీ డిజైన్ వేస్తే రూ. 2వేల నుంచి రూ. 5వేల వరకు ఇస్తారు. డిగ్రీ పూర్తయిన



తర్వాత ఎలాంటి ఉద్యోగం రాకున్నా మెహందీ డిజైన్‌తో నేను ఉపాధి పొందొచ్చు.

మేఘన

**స్వయంఉపాధికి అవకాశంనెల రోజులుగా మెహందీపై ఇచ్చిన శిక్షణ**

సద్వినియోగం చేసుకున్నా. ఖాళీ సమయంలో మెహందీపై ప్రత్యేక సాధన చేసి నైపుణ్యాలు పెంచుకుంటాను. చదివే సమయంతో పాటు డిగ్రీ తర్వాత డబ్బులు సంపాదించేందుకు తోడ్పాటు అవుతుంది. ఆర్థికంగా నిలదొక్కుకుంటానన్న నమ్మకం ఏర్పడింది. మెహందీ సర్టిఫికెట్ కోర్సు స్వయం ఉపాధికి మంచి తోడ్పాటునిస్తుంది. సద్వినియోగం చేసుకుంటే ఎంతో బాగుంటుంది.

కరిష్మా సద్వినియోగం చేసుకున్నాం

మా కళాశాలలో చదువుతో పాటు విభిన్న రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. మెహందీ సర్టిఫికెట్ కోర్సు నిర్వహించటం గొప్ప అవకాశం. నెల రోజుల పాటు ఎంతో ఆసక్తితో నేర్చుకున్నాం. పండుగల సమయంలో మెహందీకి భలే డిమాండ్ ఉంటుంది. మంచి డిజైన్లు వస్తే డబ్బులు బాగానే వస్తాయి. డిగ్రీ చదివిన తర్వాత ఇంటి వద్ద ఉంటూ సొంతంగా ఉపాధి పొందొచ్చు.

షాహిస్తా అజ్మీ, ఫౌజియా బేగం, నజ్మా

# మాయమవుతున్న గుడి మాన్యం!

సిద్దిపేట : ఆలయాల భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని నిత్యం పూజలు, సందర్భానుసారంగా చేసే ఉత్సవాల ఖర్చులకు వినియోగించుకునేందుకు కేటాయించారు. కానీ అక్రమార్కుల కడుపు నింపుతున్నాయి. ఆ స్థలాల హద్దులు, సర్వే సంఖ్యలను నిర్ధారణ చేయలేదు. నిర్ధారించినా పర్యవేక్షణ కరవవడంతో కబ్జాదారులు పాగా వేస్తున్నారు. దశాబ్దాలుగా దస్త్రాల్లోనే భద్రంగా ఉంటున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. సిద్దిపేట జిల్లాలో ప్రముఖమైన దేవాలయాల భూముల పరిస్థితిపై ప్రత్యేక కథనం. మల్లికార్జునస్వామి కల్యాణోత్సవానికి 2014 డిసెంబరు 21న హాజరైన ముఖ్యమంత్రి కేసీఆర్.. 'కొమురవెల్లి ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో స్వామివారికి ముందుగా భూములు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. తితిదే మాదిరిగా విల్లాలు, కాటేజీల నిర్మాణం చేయాలన్నారు. నాలుగైదు ఎకరాలు అభివృద్ధి చేయాలని.. భారీ శివలింగం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారు. కొమురవెల్లి మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ భూములను స్వామివారికి కేటాయించేందుకు సర్వే చేశారు. కొమురవెల్లి, కిష్టంపేట, రాంసాగర్, వేచరేణి, గౌరాయపల్లిలో గుర్తించారు. అప్పట్లో 161 ఎకరాలు ఉన్నాయని గుర్తించిన అధికారులు చివరకు ఏ వివాదాలు లేని 131.09 ఎకరాలని నిర్ధారించారు. మల్లికార్జునస్వామి పేరిట దస్త్రాల్లో మార్పిడి చేశారు. భూముల వద్ద బోర్డులు ఏర్పాటు చేయించారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో కొలతలు వేసి, దేవస్థానానికి ఇంకా అప్పగించలేదు. కొందరు వ్యక్తులు ఆక్రమించి కబ్జాలో ఉన్నారు. పలు చోట్ల ఆలయాలు, సంఘాల భవనాలు, శ్మశానవాటిక నిర్మాణాలు చేపట్టారు. రెండేళ్ల క్రితం ఆలయానికి సమీపంలోనే ఓ వ్యక్తి కొంత భూమి చదును చేసి పరదాలతో గుడిసె వేశారు. నాలుగేళ్ల క్రితం రాజీవ్ రహదారి వద్ద మరో వ్యక్తి ఏకంగా గోడ నిర్మిస్తుండగా ఆలయ అధికారులు అడ్డుకున్నారు. నాలుగు నెలల క్రితం మట్టిని తరలిస్తుండగా ఈవో చూసి అడ్డుకొని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. సుదూరంగా ఉండే భూముల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. కిష్టంపేట శివారులోని ఎంబేరుమన్నారుస్వామి గుడికి సుమారు 33 ఎకరాల భూమి ఉంది. కబ్జాకు గురి కావడంతో రెండేళ్ల క్రితం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సర్వే చేశారు. కొందరు కౌలు చేసుకుంటున్నారు. గుడికి ఏమీ చెల్లించడం లేదని ఆలయ వర్గాలు తెలిపాయి. దీనిపై ఎవరూ పట్టించుకోవటం లేదు.

దుబ్బాక కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయానికి 4.24 ఎకరాలు, వేణుగోపాలస్వామి గుడికి 4.35 ఎకరాలు, సంగమేశ్వర ఆలయానికి 3.06 ఎకరాల భూములున్నాయి. వాటిలో 3.29 ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు ఆరోపణలున్నాయి. రెండేళ్ల క్రితం సర్వే చేశారు. ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోలేదు.

నంగునూరు పరిధిలో.. నంగునూరులోని రామాలయానికి దాదాపు 22 ఎకరాల భూమి ఉంది. అందులోనే శ్మశానవాటిక, రహదారులు, డంపింగ్‌యార్డు, పల్లె ప్రకృతి వనం నిర్మాణం, నర్సరీ నిర్వహణ సాగుతోంది. ఫలితంగా దేవుడి మాన్యం కుంచించుకుపోతోంది. ఆలయ సమీపంలో, విద్యుత్ ఉపకేంద్రం పక్కన రెండు చోట్ల దాదాపు రెండెకరాలు సాగు రూపంలో కబ్జాకు గురైంది. రూ.కోట్ల విలువైన భూమిపై కన్నేసిన పలువురు అనేకమార్లు కబ్జాకు విఫలయత్నాలు సాగిస్తున్నారు. నర్మెట్ట శివాలయం, రామాలయం భూములు దాదాపు 40 ఎకరాల మేర గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించారు.

# అధ్యక్షా.. ఎందుకీ వివక్ష

మంచిర్యాల : మంచిర్యాలలో పురపాలక సంఘం ప్రజాప్రతినిధులు, అధికారులు శుద్ధి చేయని కలుషిత గోదావరి నీటిని కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలో రోజూ శుద్ధ జలాన్ని తెప్పించుకుని తాగుతున్నారు. తమ ఆరోగ్యంపై ఉన్న శ్రద్ధ ప్రజలపై ఎందుకు లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇక్కడ పని చేసిన అధికారులు, కౌన్సిల్ సభ్యులకు అందరూ ప్రజలకు సరఫరా చేసే కుళాయి నీరు తాగేవారు. ఇందుకోసం డీఎఫ్ఓ కార్యాలయం పక్కన నీటి ట్యాంకు నుంచి మున్సిపల్ కార్యాలయానికి నేరుగా పైప్‌లైన్ కనెక్షన్ ఇచ్చారు. ఆ కుళాయి నుంచి 24 గంటలు మంచినీరు సరఫరా అవుతుంది. ఆ నీళ్లు తాగకుండా కొనుగోలు చేసిన శుద్ధజలం తాగుతున్నారు. ఫిల్టర్ బెడ్‌కు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. మంచిర్యాల పురపాలక సంఘానికి చెందిన ముల్కల్లలోని తాగునీటి శుద్ధి కేంద్రం ఫిల్టర్ బెడ్స్ మరమ్మతులకు రెండేళ్ల కిందట రూ. 80 లక్షల నిధులు కేటాయించారు. వీటితో ఆలస్యంగా మూడు ఫిల్టర్ బెడ్స్‌కు మరమ్మతులు చేశారు. ఇంకా మూడు ఫిల్టర్స్ బెడ్స్‌కు మరమ్మతులు చేయకుండా వదిలేశారు. ఎల్లంపల్లి జలాశయం నుంచి ముల్కల్ల పంప్‌హౌజ్‌కు తీసుకొచ్చిన రా-వాటర్‌లో ఆలం, బ్లీచింగ్ కలిపి తాత్కాలిక శుద్ధి చేసి తాగునీరు సరఫరా చేస్తున్నారు.

గుడిపేటలోని ఎల్లంపల్లి జలాశయం పంప్‌హౌజ్ నుంచి, ముల్కల్ల గోదావరిలోని బెల్లంపల్లి పురపాలక సంఘానికి చెందిన ఇన్‌టేక్‌వెల్స్



నుంచి అదే గ్రామంలో ఉన్న మంచిర్యాల మున్సిపల్ శుద్ధి కేంద్రంలోని సంపులో నింపుతారు. అక్కడి నుంచి పాతమంచిర్యాల, డీఎఫ్ఓ కార్యాలయం, ఆర్అండ్‌బీ కార్యాలయం, కాలేజీరోడ్డులో మున్సిపల్ ట్యాంకుల్లో నింపి అక్కడి నుంచి నేరుగా ఆయా కాలనీల్లో కుళాయిలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. గుడిపేటలోని మిషన్ భగీరథ పంప్‌హౌజ్ నుంచి పాతమంచిర్యాల శివారులో అండాలమ్మకాలనీ జాల గుట్టపై నిర్మించిన సంప్‌లో నింపి అక్కడి నుంచి పట్టణంలోని హైటెక్‌సిటీ, హమాలీవాడ, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ట్యాంకుల ద్వారా కుళాయిలకు సరఫరా చేస్తున్నారు.

మంచిర్యాలలో రోజురోజుకు భవన నిర్మాణం రంగం విస్తరిస్తోంది. ఇప్పటికే కొత్త కాలనీలు, శివారు ప్రాంతాల్లో అంతర్గత పైప్‌లైన్లు నిర్మించి తాగునీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలో 12,700 మందికి నల్లా కనెక్షన్లు ఉన్నాయి. నల్లా వినియోగదారుడు నెలకు రూ. 150 రుసుం పురపాలక సంఘానికి చెల్లిస్తున్నారు. అయినా శుద్ధి చేసిన తాగునీరు అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆరు నెలలుగా పని చేయని కోరినేషన్ ప్లాంట్

ముల్కల్లలోని గోదావరినది ఒడ్డున 15 ఏళ్ల కిందట రూ. 29.50 కోట్లతో మంచినీటి శుద్ధి కేంద్రం నిర్మించారు. అది నిర్మించినప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేక గుత్తేదారు నాసిరకంగా నిర్మించారు. దీంతో తరచూ పైప్‌లైన్ల లీకేజీ, ఫిల్టర్ బెడ్స్ అన్ని చెడిపోయాయి. అప్పుడు గోదావరి నీటిలో ఆలం, క్లోరినేషన్ గ్యాస్ కలిపి శుద్ధి చేసిన ప్రజలకు తాగునీరు సరఫరా చేసేవారు. ఆరు నెలల నుంచి క్లోరినేషన్ గ్యాస్ ప్లాంట్ పని చేయడం లేదు. దాని కరెంటు బోర్డు, పైపులు అన్ని ఊడిపోయి నిరుపయోగంగా మారింది. ముల్కల్లలోని మున్సిపల్ శుద్ధి కేంద్రానికి పైప్‌లైన్ ద్వారా తీసుకొచ్చిన గోదావరి రా-వాటర్‌లో చెత్తను, మట్టిని శుభ్రం చేయడానికి అమర్చిన సర్క్యులేటర్ యంత్రం నాలుగు నెలలుగా పని చేయడం లేదు. శుద్ధి పరికరాలకు మరమ్మతులు చేయించడం లేదు. మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలోని అధ్యక్షుడు పెంట రాజయ్య ఛాంబర్ ముందు గదిలో ఉన్న శుద్ధజలం క్యాన్ ఇది. ఇలా అధికారులు పని చేస్తున్న అన్ని విభాగాల్లో శుద్ధజలం తాగుతున్నారు. రోజూ వాటర్ ప్లాంట్ యజమాని ఆటో ట్రాలీలో తీసుకొచ్చి ఈ క్యాన్లను ఆయా గదుల్లో పెట్టి వెళు_న్నారు. అధికారులు, కౌన్సిల్ సభ్యులు రోజు మినరల్ వాటర్ తాగుతున్నారు. కార్యాలయానికి వచ్చే నల్లా నీరు తాగడం లేదు. .

# నిఘా నేత్రం.. నిర్వహణ శూన్యం



సూర్యాపేట : ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ నుంచి మణుగూరు బస్సు ఎక్కిన బధిర డిగ్రీ విద్యార్థిని సకాలంలో స్వగ్రామానికి చేరుకోలేదు. ఆందోళన చెందిన బంధువులు, వసతి గృహ నిర్వాహకురాలు వెంటనే పట్టణ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు కొత్తబస్టాండ్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. అవి పనిచేస్తున్నప్పటికీ ఆ దృశ్యాలు మాత్రం డీవీఆర్‌లో నిక్షిప్తం కాకపోవడంతో దర్యాప్తు ముందుకు సాగలేదు. యువతి అదృశ్యంపై ఆర్టీసీ అధికారులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయగా.. ఆమె పొరపాటుగా హైదరాబాద్ బస్సు ఎక్కినట్లు తేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

జిల్లా కేంద్రంలో సీసీ కెమెరాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. పేరుకు వందల సంఖ్యలో ఉన్నప్పటికీ పదుల సంఖ్యలో కూడా పని చేయడం లేదు. కీలక సమయంలో ఇవి మొరాయించడంతో పోలీసుల దర్యాప్తునకు ఆటంకం కలుగుతోంది. ఏదైనా నేరం జరిగినప్పుడు నిందితులను గుర్తించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సూర్యాపేట పట్టణంలో మొత్తం 320 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే.. ఇందులో 260 వరకు వివిధ కారణాలతో పనిచేయడం లేదు. కేవలం 60 మాత్రమే పనిచేస్తున్నాయి.

సొంతంగా మరమ్మతులు

సూర్యాపేట పట్టణ పోలీసు స్టేషన్‌లోని కంట్రోల్ రూంతో కెమెరాలన్నింటినీ అనుసంధానం చేశారు. ఇటీవల రోడ్ల మరమ్మతులు చేపడుతుండటంతో చాలా కెమెరాలు మొరాయిస్తున్నాయి. వీటిని తిరిగి సరి చేసేందుకు కనీసం ఇద్దరు ఇంజినీర్లు అవసరం. ఇలాంటి సమయాల్లో ఒక్కోసారి పోలీసులే రంగంలోకి దిగి సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. ఇటీవల సూర్యాపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో ఏకంగా ఠాణా సమీపంలోనే పలు వైర్లు తెగిపోయాయి. మరోవైపు ప్రధాన కూడళ్లలో భారీ వాహనాలు తగిలి సీసీ కెమెరాల వైర్లు తెగిపోయి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే విద్యుత్తు స్తంభాలపై ఎవరైనా మరమ్మతులు చేసే సమయంలో పొరపాటుగా కరెంటు తీగలను కట్ చేస్తే ఆ పరిధిలోని పదుల సంఖ్యలో కెమెరాలకు సరఫరా నిలిచిపోతోంది. ఇలా కొన్ని కీలక సమయాల్లోనే కెమెరాలు పనిచేయని ఘటనలు సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంటున్నాయి.

నిర్వహణకు నిధుల్లేవ్

నిఘా కెమెరాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించడం లేదు. వ్యాపారులు స్వచ్ఛందంగా చందాలు పోగు చేసుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల ఎంపీ నిధుల నుంచి సుమారు 200 కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ గుత్తేదారు పనులు పూర్తి చేయకుండానే మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయినట్లు సమాచారం. స్థానిక పోలీసు అధికారులే ఎలాగోలా నిధులు సమకూర్చుకొని నిర్వహణ బాధ్యతలను అతికష్టంగా చేపడుతున్నారు. పోలీసు శాఖలోనూ సిబ్బంది కొరత వేధిస్తూనే ఉంది. కంట్రోల్ రూంలో నిరంతర పర్యవేక్షణ సాధ్యం కావడం లేదు.

మరమ్మతులు చేయిస్తున్నాం-రాజశేఖర్, ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట

చిన్న చిన్న సమస్యలు ఎదురై సీసీ కెమెరాలు పనిచేయని సమయంలో వెంటనే మరమ్మతులు చేయిస్తున్నాం. ఇటీవల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పట్టణంలో కొన్ని పనిచేయడం లేదు. వీటికి మరమ్మతు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించాం.

# ఆర్థిక పాఠం.. ఉన్నతికి మార్గం

చెన్నూరు: మహిళా సంఘాల సభ్యులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుంటున్నాయి. అర్హత కలిగిన సభ్యులకు స్త్రీనిధి రుణాలు అందుతున్నాయి. సభ్యుల్లో ఎవరికి అత్యవసరమనే విషయాన్ని గుర్తించి వారికి ముందుగా రుణ సదుపాయం కల్పించాలి. ఇది సక్రమంగా అమలు కాకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈక్రమంలో వారు ఉన్నతస్థితి సాధించేందుకు సంఘాల సభ్యులకు ప్రభుత్వం స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయిస్తోంది. ఇందుకు దోహదపడేలా ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఒక్కో మహిళా పొదుపు సంఘంలో సుమారు 12మంది సభ్యులు ఉంటారు.. మొదటి ఆరునెలల వరకు పొదుపుపైనే దృష్టి ఉంటుంది. తర్వాత బ్యాంకు రుణాలు ప్రారంభమవుతాయి. ఎలాంటి పూచీకత్తులు లేకుండానే రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు వస్తున్నాయి. స్వయం సహాయక సంఘం సభ్యులు రుణాలు తీసుకొని స్వయం ఉపాధికి పెట్టుబడి పెట్టేలా సంబంధిత అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

మహిళల భవితకు భరోసా

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 67,644 స్వయం సహాయక సంఘాల్లో 7,20,296 మంది సభ్యులు ఉన్నారు. సభ్యులు తీసుకుంటున్న రుణాలు, చేస్తున్న పొదుపునకు లెక్కలు పక్కాగా ఉండాలన్న ఉద్దేశ్యంతో



ఆర్థిక అక్షరాస్యతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉట్నూరులో విడతల వారీగా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే మండలానికి నలుగురు మహిళ వీవోఏల చొప్పున మొదటి విడత శిక్షణను పూర్తిచేశారు. శిక్షణ పొందిన వీవోఏలు గ్రామైక్య సంఘాలకు ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ ఇస్తారు. వారు సంఘాల్లోని సభ్యులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారు. తద్వారా సభ్యుల ఆర్థిక స్థితి మెరుగుపరచాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యం.

సభ్యులకు ఏం నేర్పుతారంటే..

పొదుపు సంఘాల్లో చేరితే ప్రయోజనాలు

క్రమం తప్పకుండా పొదుపు

రుణాలతో స్వయం ఉపాధి రంగం ఎంపిక

సానుకూల దృక్పథంతో ముందుకు సాగడం

వ్యాపారంలో రాణించేందుకు దోహదం చేసే నడవడి

మార్కెట్‌ను సర్వే చేసే విధానం, ఉత్పత్తులకు డిమాండ్ అంచనా వేయడం

క్షేత్రస్థాయిలో పర్యటనలు, అనుభవజ్ఞులతో అవగాహన

విడతల వారీగా శిక్షణ..

– శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, మంచిర్యాల

మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు, స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకుంటేనే సత్ఫలితాలు ఉంటాయి. ఇదే ఉద్దేశ్యంతో ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ ఇస్తున్నాం. సభ్యులు ఆర్థిక ఉన్నతికి ఎలా బాటలు వేసుకోవాలన్న అంశంపై వీవోఏలకు శిక్షణ ఇస్తున్నాం. వీవోఏలు తాము నేర్చుకున్న విషయాలను మహిళా సంఘాలకు వివరించడం ద్వారా ఆర్థిక అక్షరాస్యతను పెంపొందిస్తారు. మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.

# కమీషన్ ఎప్పుడు వస్తుందో..!



నల్గొండ : ప్రభుత్వం మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యం కొనేంతవరకు బాగున్నా.. ధాన్యాన్ని సేకరించిన మహిళా స్వయం సహాయక సంఘాలు( డీఆర్‌డీవో), ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, మార్కెటింగ్ యార్డులకు సకాలంలో కమీషన్‌ను విడుదల చేయకపోవడంతో.. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నిరీక్షణ తప్పడం లేదు. ఈ కేంద్రాల్లో రైతులకు మౌలిక సదుపాయాలు, కొనుగోళ్లకు అవసరమైన పరికరాలు, ఇతర ఖర్చులకు ప్రభుత్వం కమీషన్ అందిస్తోంది. అయితే ఆ కమీషన్ చెల్లింపులో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. గత వానాకాలం, యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు కమీషన్ బకాయిలు ఇప్పటి వరకు విడుదల కాకపోవడంతో కొనుగోలు కేంద్రాల వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.రైతులకూ..ప్రభుత్వం ధాన్యం సేకరించే క్రమంలో.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులకు ప్రభుత్వం క్వింటాలుకు రూ. 32 హమాలీ ఛార్జీలుండగా.. ఇందులో రూ.27 సివిల్ సప్లై భరించాలి. రూ.5 వరకు రైతులు చెల్లించాలి. కానీ కొనుగోలు సమయంలో సివిల్ సప్లై ఇవ్వనందున రైతులే మొత్తం రూ.32 హమాలీలకు చెల్లిస్తున్నారు. దీంతో సీజన్ ముగిసిన వెంటనే రూ.5 చొప్పున పౌర సరఫరాల శాఖ విడుదల చేసి రైతులకు చేరవేయాలి. వీటిని ప్రభుత్వం చెల్లించడం లేదు. జిల్లాలో 2022-23 వానాకాలానికి, యాసంగికి సంబంధించి రూ. కోట్లు 1.07 కోట్లు విడుదల కావల్సి ఉంది. వీటికోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చెల్లించాల్సిన కమీషను విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు పౌరసరఫరాల సంస్థ అధికారులు పేర్కొంటున్నారు. నిధులు విడుదల కాగానే చెల్లింపులు చేయనున్నట్లు వివరించారు.

రెండు సీజన్ల సొమ్ము చెల్లించాలిరైతులు పండించే ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు పౌర సరఫరాలశాఖ ప్రతి సీజన్‌లో డీఆర్‌డీవో, ప్రాథమిక సహకార సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఇందు కోసం కొనుగోలు చేసిన ధాన్యంలో క్వింటాలుకు రూ.35 చొప్పున కమీషన్‌ను సంఘాల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. గత వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన రూ.48.60 కోట్లు సొమ్ము చెల్లించాల్సి ఉంది. జిల్లాలో 2022-23 వానాకాలం సీజన్‌కు సంబంధించి 4.59 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. దీనికిగాను కొనుగోలు కేంద్రాలకు రూ.13.50 కోట్లు కమీషన్ కింద చెల్లించాల్సి ఉంది. యాసంగి సీజన్ కొనుగోళ్లకు సంబంధించి 8.90 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. దీనికిగాను రూ.35.10 కోట్లు కమీషన్ కింద చెల్లించాలి.

# పనులు ఇష్టారాజ్యం.. అన్నదాతలకు కష్టం

ఆసిఫాబాద్: జిల్లాలో వట్టివాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల పరిస్థితి 'మూలిగే నక్కపై తాటికాయ పడిన' చందంగా మారింది. ఇప్పటికే శిథిలమైన కాలువలు, పూడుకుపోయిన తూములు, మరోవైపు కోల్‌డంప్ వ్యర్థాలు జలాశయంలో పేరుకుపోయి సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. తాజాగా నాలుగు వరుసల రహదారి గుత్తేదారు కాలువల నీళ్లు అవతల వైపు వెళ్లకుండా ఇష్టానుసారంగా పనులు చేయడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులు సైతం పలుమార్లు ఎన్‌హెచ్ఏఐ అధికారులకు ఫిర్యాదు చేసినా గుత్తేదారు పట్టించుకోవడం లేదు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో కాలువల నీటితో పంటలను బతికించుకునే అవకాశం లేకుండా పోయిందని కర్షకులు వాపోతున్నారు. 2.8 టీఎంసీల సామర్థ్యం ఉన్న వట్టివాగు జలాశయానికి 25 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం నాలుగు వరుసల రహదారి పనులు, అధ్వాన కాలువల వల్ల రెండు, మూడు వేల ఎకరాలకు మించి నీరందించడం లేదు. పిల్ల కాలువలు, పంపిణీ కాలువలను నాలుగు వరుసల గుత్తేదారు చాలాచోట్ల మూసివేశారు. రహదారి కింద సరైన రీతిలో కాలువలను ఏర్పాటు చేయకపోవడంతో నీళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. దీంతో రహదారి అవతల వైపు ఉన్న దాదాపు 7500 ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి తలెత్తింది. ఈ సమస్య పరిష్కరించాలని అన్నదాతలు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కాలువలు రహదారిని దాటే విధంగా కాకుండా సమాంతరంగా ఏర్పాటు చేయడంతో చాలాచోట్ల నీళ్లు మరోవైపునకు వృథాగా పోవడం లేదా వెనక్కి వస్తున్నాయి.

ఇదీ పనుల తీరు..వట్టివాగు జలాశయానికి 15 ప్రధాన పంపిణీ కాలువలున్నాయి. ప్రస్తుతం ఇవన్నీ నాలుగు వరుసల రహదారి పనులతో అస్తవ్యస్తంగా మారాయి. గుత్తేదారు సరైన రీతితో పనులు చేయకపోవడంతో ఒకవైపు పైపులు మట్టిలో కూరుకుపోవడం వల్ల డీ8 పంపిణీ కాలువ దగ్గర గండిపడింది. డీ10 కాలువ వద్ద అదే పరిస్థితి ఉంది. డీ2 వద్ద నీరు రహదారికి ఒకవైపు మాత్రమే వచ్చి ఆగాయి. డీ6 కాలువ నీరు సైతం రహదారి అవతలవైపు వెళ్లడం లేదు. వీటితో పాటు, డీ4, ఎల్2, డీ8, ఆర్2, డీ2, ఎల్2 కాలువ వద్ద గుత్తేదారు ఎలాంటి పనులు చేపట్టలేదు. డీ11 కాలువ వద్ద పైపుల పనులను అసంపూర్తిగా వదిలేశారు. ఈ విషయంపై నీటిపారుదలశాఖ ఏఈ జానీ మంగళవారం రెబ్బెన పోలీసులను ఆశ్రయించారు. సంబంధిత ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఎవరూ ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో గుత్తేదారు ఆడిందే ఆటగా మారగా.. అన్నదాతలకు సాగునీరు అందకుండా పోతుంది.

కాలువనే పూడ్చారు..ఆసిఫాబాద్ పట్టణ సమీపంలో రాజురా వెళ్లే మార్గం దగ్గర గుత్తేదారు క్యాంప్ వేశారు. లారీలు, ఇతర సామగ్రి అక్కడ నిల్వ చేస్తున్నారు. క్రషర్ సైతం ఏర్పాటు చేశారు. ఈ ప్రదేశం మీదుగానే డీ2- ఎల్1 పంపిణీ కాలువ వెళ్లేది. సదరు గుత్తేదారు ఏకంగా ఈ కాలువనే పూడ్చి వేశారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. కాలువ తకనుమరుగైనా అడిగేవారు లేరని, ఎండుతున్న పంటలకు నీళ్లు అందించని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.గుత్తేదారుకు నోటీసులు అందిస్తాం- గుణవంత్‌రావు, నీటి పారుదలశాఖ ఈఈవట్టివాగు ప్రాజెక్టు కాలువలు ఉన్న ప్రదేశాల్లో గుత్తేదారు బాక్స్ కల్వర్టులు నిర్మించాలని చెప్పాం. మాకు సమాచారం ఇవ్వకుండానే చాలాచోట్ల పైపులు మాత్రమే వేశారు. కొన్నిచోట్ల అవీ వేయలేదు. ఇటీవలే నోటీసులు అందజేశాం.

# దళితబంధుపై కసరత్తు

ఆదిలాబాద్: ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన దళితబంధు సాయంపై రాష్ట్ర ప్రభుత్వం మరోసారి దృష్టిసారించింది. ఉమ్మడి జిల్లాలో 11 వేల మంది లబ్ధిదారులకు సాయం చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి జీవో ఎం.ఎస్ నెంబరు 8 ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశాలు జారీ చేసింది. సాయం కోసం రూ. 1,100 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

వాస్తవంగా ప్రస్తుతం అధికారులకు వచ్చిన ఉత్తర్వుల ప్రకారం దరఖాస్తు చేసే విధానమేదీ జారీ కాలేదు. ప్రజాప్రతినిధుల ద్వారా వచ్చే దరఖాస్తుదారుల జాబితాను గ్రామ, మండల, జిల్లా కమిటీ ద్వారా నిర్ధారణ చేసి అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. ఆ తర్వాత జిల్లా పాలనాధికారి ద్వారా జిల్లా మంత్రి ఆమోదం తీసుకుని లబ్ధిదారులకు సాయం అందించాలనేది ప్రాథమిక నిబంధన. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి ఇళ్లు లేని పేదలు, దళిత కులానికి చెందినవారు కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. కుటుంబానికి ఆధారమయ్యేలా వ్యవసాయం, రవాణా, పారిశ్రామిక, సేవా రంగాల్లో స్థిరపడి స్వయం ఉపాధి కల్పించాలనేది ప్రభుత్వ ఆలోచన. హుజూరాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించినా తొలి విడత దళితబంధులో ప్రభుత్వం అనుకున్నట్లు అందరికీ సాయం అందలేదు. తాజాగా జిల్లాల వారీగా ప్రభుత్వం లక్ష్యం నిర్ణయించడమే కాకుండా అవసరమైన నిధులను సైతం కేటాయించనున్నట్లు స్పష్టం చేసింది. త్వరలో దరఖాస్తులను స్వీకరించి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలనే దానిపై అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

దరఖాస్తు విధానం రాలేదు- ఎన్.శంకర్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి

ప్రభుత్వ ప్రాథమిక నిబంధన ప్రకారం దరఖాస్తు చేసే విధానమైతే రాలేదు. ప్రజాప్రతినిధుల ద్వారా వచ్చే సిఫారసులు గ్రామస్థాయిలో విచారణ చేస్తాం. లేదా తదుపరి ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

# మంచంపట్టిన పల్లెలు

తిర్యాణి : జిల్లాలో జ్వరాలు ప్రబలుతున్నాయి. డయేరియా, టైఫాయిడ్, మలేరియా, డెంగీ తదితర వాటితో పాటు సాధారణ, వైరల్ జ్వరాలతో చాలామంది ప్రజలు విలవిల్లాడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. కొంతమందిలో తెల్లరక్త కణాలు తగ్గుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. మరో వైపు జిల్లాలో రెండో ఏఎన్ఎంల నిరవధిక సమ్మెతో గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణపై ప్రభావం పడుతోంది.చాలా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ గాడి తప్పింది. మురుగు కాలువల్లో పూడిక నిండి దోమలు బెడదతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చాలా గ్రామాల్లో ఇంటికి ఒకరిద్దరు జ్వరాలతో బాధపడుతున్నారు. కొన్ని గ్రామీణ ప్రాంత ఆరోగ్య కేంద్రాల్లో రోజుకు 20- 30 మంది వచ్చే ఓపీ(అవుట్ పేషంట్) 70-100 వరకు పెరిగింది. దీంతో ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏజెన్సీ పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జ్వర పీడితులను గుర్తించి రక్తపూతలు సేకరిస్తున్నారు. 783 గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి 23,649 మందిని పరీక్షించగా.. 2591 మందికి జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారిలో 13 మలేరియా, 11 టైఫాయిడ్, మిగతావి సాధారణ జ్వరాలుగా గుర్తించి వైద్య సేవలందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సుమారు వందకు పైగా రెండో ఏఎన్ఎంలు వారం రోజులుగా నిరవధిక సమ్మెకు దిగడంతో గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇది వరకు రోజుకు 30-35 శిబిరాలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 15-20కి పడిపోయింది.

ఇంటికి ఒకరిద్దరు బాధితులు..

కొన్ని గ్రామాల్లో జ్వర బాధితులు వారం పదిరోజులుగా మంచానికే పరిమితమై తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళుతున్నా.. అక్కడ అంతంత మాత్రమే పరీక్షిస్తున్నారని.. రోజుల తరబడి జ్వరం తగ్గకపోవడంతో మళ్లీ ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు. తిర్యాణి మండలంలో చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అక్కడి పీహెచ్‌సీకి ఇది వరకు రోజుకు 20-25 వరకు వచ్చే ఓపీ.. వారం రోజులుగా 70-100కి పెరిగింది. చుట్టుపక్కల గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని కోమటివాడలో సుమారు 20 కుటుంబాల్లో ఇంటికి ఒకరిద్దరు జ్వరాలతో మంచానికి పరిమితమయ్యారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి సైతం నిత్యం 250-300 వరకు ఓపీ, 40 వరకు ఇన్‌పేషంట్లుగా చేరుతున్నారు. దీంతో వార్డులు రోగులతో నిండుతున్నాయి.

తిర్యాణి మండల కేంద్రం కోమటివాడలో నివాసముంటున్న మల్లేష్. పది రోజులుగా జ్వరంతో తెల్లరక్త కణాలు తగ్గి మంచానికే పరిమితమయ్యాడు. అయిదు రోజులు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో చూపించుకోగా తగ్గలేదు. దీంతో మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రిలో నాలుగు రోజులు చికిత్స పొంది వచ్చారు. కొడుకు సంజయ్ కూడా వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నట్లు వాపోయారు.

దుర్గయ్యది కూడా కోమటివాడ. అయిదు రోజులుగా జ్వరంతో సతమతమవుతున్నాడు. పీహెచ్‌సీలో చూపించుకున్నా.. తగ్గక పోవడంతో ప్రైవేటు వైద్యున్ని ఆశ్రయించినట్లు చెబుతున్నాడు. అపరిశుభ్రత, దోమలు విపరీతంగా పెరిగి జ్వరాలు సోకుతున్నట్లు పేర్కొన్నాడు.

# సీడీపీ నిధులు.. అభివృద్ధి పరుగులు

ఆలేరు : ఆలేరు నియోజకవర్గానికి రూ.4.71 కోట్లు మంజూరయ్యాయి. గ్రామాలు, దళితకాలనీల్లో నెలకొన్న సమస్యలు 2021లో గుర్తించారు. ఈ క్రమంలో ఇటీవల నిధులు కూడా మంజూరయ్యాయి. నియోజకవర్గంలో 188 గ్రామ పంచాయతీలు మరో 88 ఆవాస గ్రామాలు ఉన్నాయి. వీటిలో 2,53,942 మంది నివసిస్తున్నారు. ఆలేరు, యాదగిరిగుట్ట పురపాలికల్లో మరో 45వేల మంది నివసిస్తున్నారు. ఎనిమిది సంవత్సరాల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విరివిగా నిధుల మంజూరవుతుండటంతో గ్రామాల్లో కొత్త శోభ కన్పిస్తోంది. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల పరిధిలో 131 పనులు చేపట్టనున్నారు.

శాశ్వత పనులకు ప్రాధాన్యం

ఈసారి చాలా వరకు శాశ్వతంగా నిలిచే పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రధానంగా సీసీ రహదారులు, బీసీ, ఎస్సీ సామాజిక, మహిళా సమాఖ్య, యువజన సంఘాల భవన నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చారు. గతంలో చేపట్టిన పనుల్లో కొన్ని అసంపూర్తిగా ఉండగా..ఆయా పనులకు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించారు. కొత్తగా



మంజూరైన సీడీపీ నిధులతో చేపట్టనున్న పనులతో గ్రామాల్లో కొత్త వాతావరణ నెలకొననుంది.

పురపాలికకు టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.15 కోట్లు

ఆలేరు పురపాలికకు 2022-23 సంవత్సరానికి గాను టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.15 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులలో రూ.3.5 కోట్లతో పురపాలిక భవనం, రూ.2 కోట్లతో ప్రధాన రహదారి పక్కన సుందరీకరణలో భాగంగా ఫుట్‌పాత్ నిర్మాణం, టైల్స్ ఏర్పాటు, మిగతా రూ.9.5 కోట్లతో సీసీ రహదారులు, ముగుగు కాలువలు నిర్మించనున్నారు.మౌలిక వసతులు, శాశ్వత పనులకు ప్రాధాన్యం- గొంగిడి సునీత, ఎమ్మెల్యే, ఆలేరు

నియోజవకర్గంలో మౌలిక వసతుల కల్పనతో పాటు శాశ్వత పనులు చేపట్టేందుకు సమ ప్రాధాన్యం ఇస్తున్నాం. కొత్తగా మంజూరైన నిధులతో గ్రామాలలో చాలా వరకు సౌకర్యాలు సమకూరనున్నాయి. మరిన్ని పనులకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో వివిధ పథకాల ద్వారా నిధులు మంజూరు కానున్నాయి. సాగు, తాగు నీరు కల్పనలోనూ ముందున్నాం. రాబోయే కాలంలో ఆలేరును సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

# వైద్యం.. దైన్యం

దేవరకొండ: సమయపాలన పాటించని వైద్యులు.. అడపాదడపా విధులతో రోగులకు తప్పని తిప్పలు.. గిరిజన ప్రాంతంలో పెద్దదిక్కయిన ప్రభుత్వ ధర్మాసుపత్రికి సమస్యల సుస్తీ చేసింది. అత్యాధునిక యంత్రాలు లేకపోవడంతో గిరిపుత్రులకు మెరుగైన సేవలు ఎండమావిగా మారాయి. దేవరకొండ పట్టణంలోని సర్కారు దవాఖానాలో వైద్యం దయనీయంగా మారింది.

రోగుల సంఖ్య అధికం.. దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి నిత్యం 800-1000 మంది ఔట్‌పేషెంట్లు, 150-200 మంది ఇన్‌పేషెంట్లు వస్తుంటారు. దేవరకొండ నియోజకవర్గంలోని ఏడు మండలాలతో పాటు నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని గుర్రంపోడు, పెద్దవూర, మునుగోడు నియోజకవర్గంలోని నాంపల్లి, మర్రిగూడ, నాగర్‌కర్నూల్ జిల్లాలోని సిద్దాపురం, చారగొండ నుంచి రోగులు వస్తుంటారు. రోగుల సంఖ్యను బట్టి వైద్య పరికరాలు ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్‌ను ఆశ్రయిస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు. నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై రోడ్డు ప్రమాదాలు నెలకు 10 వరకు జరుగుతుంటాయి. క్షతగాత్రులను దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తారు. ఇక్కడి వైద్యులు సరైన పరికరాలు లేక వేరే ఆసుపత్రికి రిఫర్ చేస్తుంటారు. దేవరకొండ గిరిజన ప్రాంతంలో



కాన్పుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. మారుమూల గిరిజన ప్రాంతం కావడంతో వంశోద్ధారకుని కోసం ఎక్కువ సంతానం కలిగి ఉంటారు. భవన సమస్యే ప్రథమం.. దేవరకొండ ప్రభుత్వాసుపత్రి నైజాం కాలంలో ఏర్పడింది. జజ్జిఖానాగా ప్రారంభమైన ప్రభుత్వాసుపత్రి 30 నుంచి 50 పడకలుగా రూపుదిద్దుకుంది. జనాభా పెరుగుతుండడంతో 2013లో దేవరకొండ ప్రభుత్వాసుపత్రిని 100 పడకలుగా విస్తరిస్తూ అప్పటి ప్రభుత్వ జీవో జారీ చేసింది. దీంతో దేవరకొండ సర్కారు దవఖానాలోనే పైఅంతస్తు ఏర్పాటు చేశారు. రెండు అంతస్తులు నిర్మించాల్సి ఉన్నా భవన సమస్యతో ఒకటికే సరిపెట్టారు. అదికాస్తా చిన్నపాటి వర్షానికే కురుస్తుంది. నవజాత శిశుకేంద్రానికి మరో పది బెడ్లు, కాన్పుల వార్డుకు మరో 20 బెడ్లు మంజూరుకు ప్రతిపాదనలున్నాయి. మంజూరైనా భవన సమస్య దేవరకొండ ఏరియా ఆసుపత్రిని వేధిస్తుంది.

స్థలాన్ని పరిశీలిస్తున్నాం

- డాక్టర్ రాములునాయక్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్

ఆసుపత్రి సేవలు మెరుగుపర్చేందుకు స్థలం సమస్య ఉంది. వెనుకభాగంలో క్వార్టర్స్ ఉన్న స్థలంలో నిర్మించాలా.. వేరే చోట ఏర్పాటు చేయాలా అనేది ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది.

# చుకు చుకు రైలు.. అసలు పట్టాలెక్కదు..!



కొత్తగూడెం : నిత్యం వేలాది మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే కొన్ని రైళ్లు రెండు నెలలుగా పట్టాలెక్కటం లేదు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల నుంచి వివిధ ప్రాంతాలకు రోజూవారీ పనులు, ఉద్యోగం, వ్యాపార నిమిత్తం వెళ్లేవారికి ఇవి ఉపయోగకరంగా ఉండేవి. జూన్ 18 నుంచి బలార్షా-భద్రాచలం రోడ్డు, భద్రాచలం రోడ్డు-విజయవాడ, డోర్నకల్-విజయవాడ, ఖాజీపేట్-విజయవాడ (కొవిడ్ కంటే ముందు నడిచేది) తదితర రైళ్లను రద్దు చేయడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. నూతన రైల్వేలైన్ల నిర్మాణం, మరమ్మతుల పేరిట అధికారులు రైళ్ల రద్దు ప్రకటనలిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో రైళ్ల రద్దు విషయం తెలియక ప్రయాణికులు స్టేషన్లలో పడిగాపులు కాయాల్సి వస్తోంది.

పొడిగింపులు ఇంకెన్నాళ్లో..? ఖమ్మం జిల్లాలో మూడో రైల్వేలైన్ పనులు, రోలింగ్ కారిడార్ బ్లాక్ (రైల్వే ట్రాక్ మరమ్మతులు) కార్యక్రమంలో భాగంగా జూన్ నుంచి పలు ప్యాసింజర్ రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు తాత్కాలికంగా రద్దు చేశారు. జూన్ 18 నుంచి భద్రాచలం రోడ్డు మీదుగా వెళ్లే భద్రాచలం-బలార్షా, భద్రాచలం-విజయవాడ రైళ్లను రద్దుపరిచారు. రెండువారాలకోసారి రద్దు నిర్ణయాన్ని పొడిగిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఈ నెల 20 నుంచి 28 వరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. తక్కువ ప్రయాణ ఖర్చు, సమయానికి గమ్యాన్ని చేర్చే ప్యాసింజర్ రైళ్లతో మధ్యతరగతి జీవితాలు ముడిపడి ఉంటాయి. కూరగాయలు, నిత్యావసర సరకులు అమ్ముకునే చిరువ్యాపారులు ఎక్కువగా వీటిపై ఆధారపడతారు. రెండు నెలలుగా వీటిని రద్దు చేయటంతో రోడ్డు మార్గంలో అధిక ఛార్జీలు చెల్లించి ప్రయాణించాల్సి వస్తోంది.

ప్యాసింజర్ రైళ్లే ఎందుకు?

ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కాకుండా పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లనే రద్దు చేయటం వెనుక అధికారుల ఉద్దేశం ఏమిటనేది తెలియటం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఖమ్మం రైల్వేస్టేషన్ మీదుగా విజయవాడ వెళ్లే ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం మీదుగా డోర్నకల్-విజయవాడ, విజయవాడ-డోర్నకల్, భద్రాచలం రోడ్డు- విజయవాడ, బలార్షా-భద్రాచలం రోడ్డు, సిర్పూర్ టౌన్-భద్రాచలం రోడ్డు రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి.ఒక్కో రైలు సర్వీసులో రోజూ 200-300 మంది ప్రయాణిస్తుంటారు. ఇవి రద్దవటంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అధిక ఛార్జీలతో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని ప్రయాణికులు వాపోతున్నారు. ఖమ్మం రైల్వేస్టేషన్ నుంచి విజయవాడకు వెళ్లేందుకు ప్యాసింజర్ రైలు టిక్కెట్ ధర రూ.25 ఉండేది. కొవిడ్ తదనంతరం ఎక్స్‌ప్రెస్ ధర నిర్ణయించి రూ.50కి పెంచారు. భద్రాచలం రోడ్డు నుంచి బలార్షా వరకు ప్రయాణించే రైలు రద్దవటంతో సింగరేణి ఉద్యోగులూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తాత్కాలికంగా రద్దయినవి

డోర్నకల్- విజయవాడ

భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం)-విజయవాడ

ఖాజీపేట్-విజయవాడ (కొవిడ్ కంటే ముందు ఉండేది)

భద్రాచలం రోడ్డు- బలార్షా

సిర్పూర్ టౌన్- భద్రాచలం రోడ్డు

మాది ఎర్రుపాలెం. ఖమ్మంలో చిరువ్యాపారం చేస్తుంటాను. రోజూ పుష్‌పుల్ రైలులో రాకపోకలు సాగిస్తుంటాను. ఈరైలు రద్దవటంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. సీజన్ పాస్ రూ.30 తీసుకునేవాడిని. రోజూ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రాకపోకలు సాగించటం వల్ల వ్యాపారానికి అనువైన సమయానికి రాలేకపోతున్నా. పేదల కోసం ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి.రాంబాబు, చిరువ్యాపారి, ఎర్రుపాలెం

# గురువు కొలువుకు గురి!



కరీంనగర్ : ఏళ్ల తరబడి నిరీక్షణకు తెరదించేలా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి పచ్చజెండా ఊపింది. జిల్లాల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఆర్థిక శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయడంతో ఉమ్మడి జిల్లా అభ్యర్థులు సమాయత్తమవుతున్నారు. ఇటీవల టెట్ నోటిఫికేషన్ వెలువడటం.. ఇంతలోనే టీఆర్టీ (టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) ద్వారా భర్తీకి ఆమోద ముద్ర పడటంతో బడిలో చదువులకు మరింత మేలు జరుగనుంది. ఉద్యోగాల ఆశ నెరవేరడంతో పాటు ఉపాధ్యాయుల సంఖ్య పెరగనుంది.

కొంతలో కొంత ఊరట..

ఏడేళులగా డీఎస్సీ, టీఆర్టీ ప్రక్రియలు లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో నిరుద్యోగ యువత వెయ్యి కళ్లతో ఎదురు చూస్తోంది. గతేడాది ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించగా రెండు పేపర్లకు కలిపి 32,329 మందీ పరీక్ష రాశారు. ఇందులో 40 శాతం మంది మాత్రమే అర్హత సాధించారు. నాలుగు జిల్లాల పరిధిలో గతంలో టెట్ అర్హులు, కొత్తవారు కలిపి దాదాపు 15-20 వేల మంది ఉపాధ్యాయ నియామక పరీక్ష రాయనున్నారు. మరోవైపు నాలుగు జిల్లాల పరిధిలో ఖాళీల వివరాలను విద్యాశాఖ అధికారులు పలుమార్లు రాష్ట్ర స్థాయి అధికారులకు పంపించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తి ఆధారంగా ఎక్కడెక్కడ అవసరమో నివేదించారు. ఖాళీగా ఉన్న పోస్టుల్లో 70 శాతం వరకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయనుండగా, 30 శాతం పోస్టులను నేరుగా నియమించాలనే నిబంధన ఉంది. దీంతో ఈ సారి టీఆర్టీలో నేరుగా భర్తీ చేసే పోస్టుల సంఖ్య తక్కువగానే ఉంది. గత నెలలో హేతుబద్ధీకరణ కోసం రాష్ట్ర విద్యాశాఖ ఆయా జిల్లాల నుంచి ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య వివరాలను తెప్పించుకుంది. ఇప్పుడు ఈ వివరాల ఆధారంగానే ఖాళీలను గుర్తించడం.. పలు పోస్టులు జిల్లాల్లో మిగులుగా ఉండటంతో నియామక పోస్టుల సంఖ్య తగ్గింది. తాజాగా వెలువడిన ఉత్తర్వుల్లో కేవలం 393 పోస్టులనే పేర్కొన్నారు. వాస్తవానికి కరీంనగర్ జిల్లాలో 387, జగిత్యాలలో 701, పెద్దపల్లిలో 286, సిరిసిల్లలో 375 ఖాళీలున్నాయి. మొత్తంగా 1749 పోస్టులకు గాను కేవలం 393 నియామకాల ద్వారా నిండుతుండగా.. మిగతావి పదోన్నతుల ద్వారా భర్తీ కావాల్సి ఉంది.

# క్లిక్ దూరంలో ఓటు హక్కు

పెద్దపల్లి : ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లాక జాబితాలో పేరు లేక నిరాశగా వెనుదిరగడం ప్రతి ఎన్నికల్లో కొందరికి అనుభవంలోకి వస్తోంది. అక్కడి అధికారులను అడిగినా ఫలితం ఉండక నిరాశగా వెనుదిరగక తప్పడం లేదు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కొందరి నిర్లక్ష్యం వల్ల కోల్పోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆధునిక సాంకేతిక విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది.ఓటరు జాబితాలో తమ పేరు ఉందా? లేదా? అనే విషయాన్ని బీఎల్‌వోలను ఆశ్రయించకుండానే ఓటర్లు నేరుగా తెలుసుకొనేలా ఒక్క క్లిక్‌తో చూసుకునే వెసులుబాటు కల్పించింది. ఇటీవల ఓటరు జాబితా విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. తుది జాబితా రూపకల్పనలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఇక చరవాణిలోనే కొత్తగా ఓటు హక్కు నమోదు, జాబితాలో పేరు చూసుకునే అవకాశాన్ని కల్పించింది.

నేడు, రేపు ప్రత్యేక శిబిరాలు

ఎన్నికల సంఘం ఆదేశాలతో తుది ఓటరు జాబితా రూపకల్పనకు అధికారులు శ్రమిస్తున్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కుపై ముమ్మరంగా అవగాహన కల్పిస్తున్నారు. ఈ నెల 26, 27, వచ్చే నెల 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో అర్హులకు ఓటు హక్కు కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 27,98,168 మంది ఓటర్లుండగా 13,79,359 మంది పురుషులు, 14,18,687 మంది మహిళలు, 122 మంది ఇతరులు ఉన్నారు.

విద్యా సంస్థల్లో చైతన్యం

ఓటు హక్కు నమోదుపై విద్యా సంస్థల్లో చైతన్యం కల్పిస్తున్నారు. కళాశాలల్లో 'ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్'లు ఏర్పాటు చేసి నలుగురు విద్యార్థులను అంబాసిడర్లుగా నియమిస్తున్నారు. 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా నమోదు చేసుకోవడం, ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా వీరు అవగాహన కల్పించనున్నారు. పాఠశాలల్లో 'చువాన్ పాఠశాల' కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఇంటికి వెళ్లిన విద్యార్థులు తల్లిదండ్రులకు ఓటు ప్రాముఖ్యం, కొత్తగా నమోదు చేసుకోవడంపై వివరించనున్నారు.

చూసుకునే విధానమిదీ



ఓటరు జాబితాలో పేరు చూసుకోవడంతో పాటు ఓటు హక్కు నమోదు, సవరణలను ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు. ఇందుకోసం %voters.eci.gov.in% పోర్టల్‌లో లాగిన్ కావాలి. ముందుగా చరవాణి సంఖ్య, పాస్‌వర్డుతో రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం తిరిగి పోర్టల్‌లోకి వెళ్లి రిజిస్టర్ చేసుకున్న చిరునామా నమోదు చేస్తే వచ్చిన ఓటీపీతో పేజీ తెరుచుకుంటుంది. ఓటరు గుర్తింపు కార్డు నెంబరు నమోదు చేస్తే జాబితాలో పేరు, పోలింగ్ కేంద్రం తదితర సమగ్ర సమాచారం వస్తుంది. బీఎల్‌వోల వద్దకు వెళ్లకుండానే ఓటరు వివరాలు పొందవచ్చు. జాబితాలో లేని వారు కూడా మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకుంటే వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు వస్తుంది.అవగాహన ముమ్మరం జిల్లాలో ఓటరు అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేస్తున్నాం. రాజకీయ పార్టీలు, మహిళా సంఘాల భాగస్వామ్యం తీసుకుంటున్నాం. నియోజకవర్గాల్లో ఈవీఎంల వినియోగంపై చైతన్యం కల్పిస్తున్నాం. ప్రత్యేక ఓటరు నమోదుపై పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నాం. శ్యామ్‌ప్రసాద్‌లాల్, అదనపు కలెక్టర్, పెద్దపల్లి

# పురపాలికలకే ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు

సూర్యాపేట : ఇళ్ల స్థలాల యజమానులు లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) కోసం చెల్లించే డబ్బులు పురపాలక సంఘాలకే చెందనున్నాయి. ఈ నిధులు ప్రభుత్వానికా, పురపాలక సంఘాలకా అనే మీమాంస వీడింది. ఈ స్కీం కింద వసూలయ్యే డబ్బులు వాటికే నేరుగా విడుదల కానున్నాయి. ఇందుకు బ్యాంకుల్లో ప్రత్యేక ఖాతాలు తెరవాలని మున్సిపాలిటీలకు ఆదేశాలు అందాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల్లో కొత్త ఖాతాలు తెరుచుకోనున్నాయి. త్వరలో దరఖాస్తులకు సంబంధించి డబ్బులు విడుదల కానున్నాయి. కొత్తగా వసూలయ్యే డబ్బులు సైతం ఇవే ఖాతాల్లో జమయ్యే అవకాశం ఉంది. వీటిని పురపాలక సంఘాలు అభివృద్ధి పనులకు వినియోగించుకోనున్నాయి.

వేలల్లో దరఖాస్తులు

ప్రభుత్వం 2020 ఆగస్టులో అక్రమ లే అవుట్లను క్రమబద్ధీకరించేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. అన్ని పురపాలక సంఘాల్లో వేలల్లోనే దరఖాస్తులు వచ్చాయి. వ్యక్తిగతంగా ఒక ప్లాటు దరఖాస్తుకు రూ.వెయ్యి, లే అవుట్ ఉంటే రూ.10 వేల చొప్పున చెల్లించారు.



రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలకు సంబంధించిన దరఖాస్తుల రుసుము హైదరాబాద్‌లోని ప్రత్యేక బ్యాంకు ఖాతా(పూలింగ్ అకౌంట్)లో జమయ్యాయి. ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు వసూలు చేసే రుసుము సైతం అందులోనే జమ కానుండటంతో అవి ప్రభుత్వ ఖాతాలోకే వెళ్తాయని భావించారు. తద్వారా పురపాలక సంఘాల అభివృద్ధికి వాటిని విడుదల చేస్తారో లేదో అనేదానిపై అయోమయం నెలకొంది. తాజాగా పురపాలక ఉన్నతాధికారుల నుంచి ప్రత్యేక ఆదేశాలు రావడంతో ఎల్‌ఆర్‌ఎస్ నిధులు స్థానికంగానే ఖర్చు చేసేందుకు అవకాశం లభించనుంది. రహదారులు, మురుగు కాల్వలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేసేందుకు వీలు ఏర్పడనుంది. దరఖాస్తుల రూపేణా తక్కువ నిధులు రానున్నా ప్లాట్ల క్రమబద్ధీకరణ పూర్తయితే రూ.కోట్లలో మున్సిపాలిటీకి నిధులు సమకూరనున్నాయి.

నాటి మార్కెట్ ధరే వసూలు

2020లో ఉన్న మార్కెట్ ధరల మేరకు ప్లాట్ల క్రమబద్ధీకరణకు రుసుము వసూలు చేయనున్నారు. అయినా ఒక్కో ప్లాటుకు రూ.20 వేల నుంచి రూ.38 వేల వరకు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. రుసుముల రూపేణా పురపాలక సంఘాలకు భారీగానే ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కో మున్సిపాలిటీకి రూ.కోట్లలో ఆదాయం రానుంది.

# కాల్వకు కోత.. రైతులకు వెత

సూర్యాపేట : జిల్లా ఆశలసౌధం ఏఎమ్మార్ ప్రాజెక్టు కాల్వలపై పర్యవేక్షణ లోపించింది. కాల్వలు ఏళ్ల తరబడి నిర్వహణకు నోచుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. ఎక్కడ చూసినా విస్తృతంగా పెరిగిన కంపచెట్లు, పూడిక తీతకు నోచుకోకపోవడం, లైనింగ్ లేకపోవడంతో పలుచోట్ల కోతకు గురై ప్రమాదఘంటికలు మోగిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన కాల్వ పరిస్థితి దయనీయంగా మారింది. జంటనగరాల తాగునీటి అవసరాలకు నిత్యం నీటిని సరఫరా చేసే ఈ కాల్వలో పెద్దమొత్తంలో నీరు ప్రవహిస్తుండడంతో పలుచోట్ల కోతకు గురైంది. దీని పరిధిలోని డిస్ట్రిబ్యూటరీల వద్ద ఔట్‌లెట్‌లు కోతకు గురయ్యాయి. ఔట్‌లెట్ ఒక చోట కాల్వ ఒక చోటకు చేరుకున్నాయి. ఇందుకు అక్కంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ 10, 11 దుస్థితే నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ప్రాజెక్టు పరిధిలో ప్రధానమైన అతిపెద్ద డిస్ట్రిబ్యూటరీ 8, 9 పరిస్థితి ఇదే కోవలోకి వస్తుంది. ప్రాజెక్టు నుంచి పీఏపల్లి, పెద్దవూర, అనుముల, తిరుమలగిరి సాగర్ మండలాల్లో 34.5 కిలోమీటర్లున్న ఈ కాల్వ ద్వారా ఆయా మండలాల్లో యాసంగి, వానాకాలం సీజన్లో 30 వేల ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తుంటారు. ఈ కాల్వ ఎక్కడ చూసినా కోతలే దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా అక్కంపల్లి సమీపంలో ప్రారంభమయ్యే ఈ కాల్వ పర్యవేక్షణ రహదారి తిరుమలగిరి వరకు పెద్ద మొత్తంలో కోతకు గురై ప్రమాదకరంగా మారింది. తిరుమలగిరి, అక్కంపల్లి వాసులు ఇక్కడి నుంచే ఇతర గ్రామాలకు రాకపోకలు కొనసాగిస్తుంటారు. రహదారి కోతకు గురై పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సమస్యను స్థానికులు పలుమార్లు ప్రాజెక్టు అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరవయ్యారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాల్వల మరమ్మతులు చేపట్టి ఆయకట్టు రైతులు, స్థానికుల ప్రయాణ బడలికలు తీర్చాలని వారు కోరుతున్నారు.

## కదులుతున్న యూరియా బస్తాలు

ఖమ్మం : మార్క్‌ఫెడ్ నుంచి రెండు రోజులుగా యూరియా బస్తాలు కదులుతున్నాయి. భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో యూరియా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఆయా ప్రాంతాల్లో అన్నదాతల అవసరాలకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఖమ్మం జిల్లాలో.. మార్క్‌ఫెడ్ బఫర్ నిల్వల నుంచి వైరా మండలానికి 260 మెట్రిక్ టన్నుల యూరియాను గురువారం కేటాయించారు. పాలడుగు, గొల్లపుడి, వైరా, తాటిపుడి, పూసలపాడు, గరికపాడు సహకార సంఘాలకు సరఫరా చేశారు. సత్తుపల్లి మండలానికి 60 మె.టన్నులు పంపించారు. కిష్టారం, కాకర్లపల్లి, బేతుపల్లి ప్రాంత రైతులకు వీటిని అందజేశారు. నేలకొండపల్లి మండలానికి 60, కూసుమంచి మండలానికి 40 మె.టన్నులు విడుదల చేశారు. నేలకొండపల్లి మండలంలోని సొసైటీలకు 300 మె.టన్నులను శుక్రవారం తరలించారు. వైరా, చింతకాని, నాగులవంచ, జక్కేపల్లి, కొణిజర్ల ప్రాంతాలకు 180 మెట్రిక్ టన్నులను సర్దుబాటు చేశారు.

తమ సంస్థ వద్ద ఖమ్మం జిల్లాకు సంబంధించి 6,334 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ నిల్వలు, కమిషనరేట్ రిజర్వ్ పూల్ నుంచి మరో 400 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించి 5,716 మెట్రిక్ టన్నులు, కమిషనరేట్ రిజర్వు పూల్ నుంచి 300 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయి. అవసరమున్న సహకార సంఘాలు సంప్రదిస్తే వెంటనే పంపిస్తాం.

సునీత, ఉభయ జిల్లాల మేనేజర్, మార్క్‌ఫెడ్

# వంట ఆగింది

ఖమ్మం : నిత్యావసరాలకు పెరిగిన ధరల ప్రకారం చెల్లించడంతోపాటు, ప్రభుత్వమే గ్యాసు, కోడిగుడ్డు సరఫరా చేయలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు జిల్లాలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందించే కార్మికులు కొందరు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాదు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే ప్రతి గుడ్డుపై రూపాయికిపైగా నష్టపోతున్నామన్నారు. అలాగే నూనె, పప్పు వంటి నిత్యావసర సరకుల ధరలు ఇటీవల కాలంలో భారీగా పెరిగాయని, దీంతో కార్మికుల కుటుంబాలు అప్పులపాలయ్యే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. తక్షణమే పెరిగిన ధరల ప్రకారం చెల్లించాలని,



గ్యాసు, గుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులు హైదరాబాదు తరలి వెళ్లడంతో నగరంతోపాటు జిల్లాలోని రఘునాథపాలెం, చింతకాని, బోనకల్లు, వేంసూరు, కల్లూరు, సత్తుపల్లి, తల్లాడ మండలాలకు చెందిన పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట తయారీ ఆగింది. ఆయా నిత్యం పాఠశాలల్లో వందలాది మంది విద్యార్థులకు వారు మధ్యాహ్న సమయంలో భోజనం అందిస్తుంటారు. అయితే కార్మికులు తాము నిరసనకు వెళ్తున్నామంటూ ముందస్తు నోటీసు ఇవ్వడంతో ఉపాధ్యాయులు జాగ్రత్త వహించారు. ఉపాధ్యాయుల సూచనతో విద్యార్థులు ఇంటి నుంచే భోజనం తెచ్చుకున్నారు. తెచ్చుకోని కొందరి కోసం ఉపాధ్యాయులు ఉప్మా తయారు చేయించి ఆకలి తీర్చారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పాఠశాలల్లో ఏర్పాట్లు చేశామని ఖమ్మం అర్బన్ ఎంఈవో ఎం.శ్రీనివాస్ తెలిపారు.

# అభాగ్యులకు అభయం

ఖమ్మం : ఆహారపు అలవాట్లు మారాయి. ఆరోగ్యంపై శ్రద్ధ తగ్గుతోంది. ఫలితంగా అనేక మంది అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. తరుణ వ్యాధులు ఎలాగూ వేధిస్తుంటాయి. దీర్ఘకాలిక సమస్యలైన రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి జబ్బులు మానసిక, శారీరక ఒత్తిడికి గురి చేస్తాయి. ఆయా సమస్యలకు జీవితకాలం చికిత్స తీసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వైద్య సేవలతో పాటు మాత్రలు, ఇంజక్షన్లు తప్పనిసరి. అలాంటి పరిస్థితుల్లో నిరుపేదలకు ఆర్థిక భారం తప్పదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం అసాంక్రమిక వ్యాధుల(నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) సేవలను ప్రవేశపెట్టింది. క్షేత్రస్థాయిలో ముందుగానే ఆయా సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్సలు అందిస్తోంది. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఖమ్మం ప్రధాన ఆస్పత్రిలోని ఎన్‌సీడీ కేంద్రం నిరంతర ఉచిత సేవలందిస్తూ రోగులకు సాయపడుతోంది. రోగుల పర్యవేక్షణ...ఎన్‌సీడీ పథకంలో భాగంగా ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామగ్రామాన ఇంటింటి సర్వేలు చేస్తోంది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఏయే రోగాలతో ప్రజలు సతమతమవుతున్నారో సమాచారం సేకరిస్తుంటారు. వారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న వైద్య సదుపాయాలను వివరిస్తారు. ఈ క్రమంలో జిల్లా ఆస్పత్రిలో కేంద్రం అందిస్తున్న వైద్య సదుపాలయాలపై వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు



నిర్వహించారు. దీర్ఘకాలిక జబ్బులైన రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్థులందరు రోజుకో, వారానికో పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. ప్రైవేటు ఆస్పత్రిలో అయితే ఈ చికిత్సలకు నెలకు రూ.1500 నుంచి 2 వేల వరకు ఖర్చు అవుతుంది. పేద వర్గాలకు అంత చెల్లించే స్తోమత ఉండదు. ఇలాంటి వ్యాధులకు మెరుగైన చికిత్సను అందించడంలో ఎన్‌సీడీ కేంద్రం ప్రముఖ పాత్రను పోషిస్తోంది. బాధిత రోగులపై ప్రత్యేక పర్యవేక్షణ కనబరుస్తోంది. వారికి నెలనెలా పరీక్షలు చేసి అవసరమైన మందులను పంపిణీ చేస్తోంది.

వ్యాయామం తప్పనిసరి...

శారీరక శ్రమ తగ్గడం, మానసిక ఒత్తిడి పెరగడం, ఆహారపు అలవాట్లు మారడం, వ్యాయామం చేయకపోవడం, ఆరోగ్య నియమాలు పాటించకపోవడం వంటివి వెరసి ఎంతోమంది పలు రకాల రుగ్మతలకు గురవుతున్నారు. రోగాలను కొనితెచ్చుకుంటున్న పరిస్థితి. దీంతో ప్రధానంగా రక్తపోటు, మధుమేహ బాధితులు పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఒత్తిడిని, వివిధ రకాల వ్యాధులకు దరిచేరకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలి. రోజుకు కనీసం గంట అయినా వ్యాయామం చేయాలి.

# వనిత.. వ్యాపార ఘనత



ఖమ్మం : పట్నవాసం మహిళలు తమ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని ఆలోచించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) స్వయం సహాయక సంఘాల్లో చేరి బ్యాంకు అనుసంధాన, స్త్రీనిధి, వీధి వ్యాపారుల రుణాలను అందిపుచ్చుకొన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వస్తువులను గుర్తించి వివిధ యూనిట్లు ఎంపిక చేసుకుని వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఆత్మవిశ్వాసంతో అడుగులు వేసి శ్రమిస్తే అనుకున్నది సాధించవచ్చని నిరూపిస్తున్నారు. సత్తుపల్లి పట్టణంలో కొందరి స్ఫూర్తిదాయక విజయాలివీ..

ఆర్థిక స్వావలంబనకు 'ఆకృతులు'

లలితకుమారి ఆసుపత్రి రోడ్డుకు చెందిన నాగళ్ల సామ్రాజ్యం వస్త్ర వ్యాపారంలో తాను ఉపాధి పొందుతూ మరికొందరికి ఆసరా కల్పిస్తున్నారు. చీరలకు ఆకృతులు రూపొందించడం కోసం రూ.3లక్షల రుణం తీసుకున్నారు. ఇంటి వద్దే కడి ప్రింట్ చీరలను తయారు చేస్తున్నారు. ముడి సరకును ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించి రకరకాల రంగులతో డైయ్యింగ్, ప్రింటింగ్, రోలింగ్ చేయించి చీరలు, డ్రెస్ మెటీరియల్స్ సిద్ధం అవుతున్నాయి. కాటన్, జకాడ్, జార్జెట్ చీరలు, డ్రస్ మెటీరియల్స్ స్వయంగా తయారు చేసి ఇంటి దగ్గర విక్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాల వారు ఇక్కడ హోల్ సేల్‌గా కొనుగోలు చేస్తున్నారు. ఇలా నెలకు రూ.50వేల వరకు మిగులుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.

అభి'రుచుల' ఆదాయం

అయ్యగారిపేటకు చెందిన సుల్తానా, ఆషా అక్కాచెల్లెళ్లు. వీరిద్దరు శివ గ్రూపులో సభ్యులుగా ఉండి డ్వాక్రా, స్త్రీనిధి నుంచి సుమారు రూ.5లక్షల వరకు రుణాలను తీసుకుని హోటల్ వ్యాపారం చేపట్టారు. తమ ఇంటి వద్దే విజయవంతంగా నిర్వహిస్తున్నారు. తీసుకున్న రుణాలను ఎక్కడా వృథా చేయకుండా పెట్టుబడి పెట్టి అన్ని ఖర్చులు పోను సుమారు నెలకు రూ.30వేల వరకు సంపాదిస్తున్నారు. వచ్చిన ఆదాయాన్ని పొదుపు చేసుకుంటూ కుటుంబాన్ని నడిపిస్తున్నారు. మెప్మా, స్త్రీనిధి, వీధి వ్యాపార రుణాలు తమకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని వారు పేర్కొంటున్నారు.

కుదుటపరచిన కాయగూరలు

పడాల అనంతలక్ష్మి శ్రీవాణి మహిళా సంఘంలో సభ్యురాలు. స్త్రీనిధి, వీధి వ్యాపారం, డ్వాక్రా బ్యాంక్ లింకేజీ నుంచి రూ.2లక్షల వరకు రుణాలను తీసుకుని సత్తుపల్లిలోని రైతు బజార్‌లో కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నారు. నెలనెలా వాయిదాలు చెల్లిస్తూ వ్యాపారాన్ని సజావుగా కొనసాగిస్తున్నారు. భర్త తోడ్పాటుతో ఇప్పటికే వ్యాపారాన్ని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూనే పిల్లలను చదివించి పెళ్లిళ్లు కూడా చేశారు. అన్ని ఖర్చులు పోనూ నెలకు దాదాపు రూ.30వేల వరకు మిగులుతోంది.

'వత్తుల' విక్రయాల వెలుగు

ప్రియదర్శినీ డ్వాక్రా గూపులో సభ్యురాలిగా ఉంటున్న జవహర్‌నగర్‌కు చెందిన ధారావత్ పద్మ బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకుంటూ భర్తకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. బ్యాంక్ లింకేజీ, వీధి వ్యాపారులు, స్త్రీనిధి, సమాఖ్య వంటి వాటిల్లో రూ.2.50లక్షలు రుణాలను తీసుకున్నాం. ఈ రుణాలతో పూజకు సంబంధించిన వత్తుల యంత్రాన్ని కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారికి విక్రయిస్తూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. అంతేకుండా ఇంటి వద్ద చీరలను విక్రయిస్తున్నారు. అన్ని ఖర్చులు పోనూ నెలకు రూ.20వేల వరకు సంపాదిస్తున్నట్లు పద్మ పేర్కొంటున్నారు.

# దేవుడా.. సర్వేత్రా ఒత్తిళ్లే!



ఖమ్మం : ఖమ్మం గ్రామీణ మండలం తీర్థాల శ్రీసంగమేశ్వరస్వామి ఆలయ భూమిని స్థానికంగా ఉండే ఓ ప్రజాప్రతినిధి ఆక్రమించి రెండేళ్ల క్రితం ఇల్లు నిర్మించేందుకు యత్నించారు. ఆక్రమణలను తొలగించేందుకు వెళ్లిన నాటి సహాయ కమిషనర్ గౌరీశంకర్, ఇన్‌స్పెక్టర్ ఆర్.సమతపై పోలీసుల సమక్షంలో అక్రమార్కులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన వెనుక ఓ పార్టీ మండల అధ్యక్షుడు ఉన్నారని అధికారులు ఆరోపిస్తున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోగా రాజకీయ జోక్యం కారణంగా కేసును పోలీసులు నీరుగార్చారని చెబుతున్నారు. బెదిరింపులకు భయపడిన నాటి ఆలయ ఈవో కొన్నిరోజులు సెలవులో ఉండి ఆ తర్వాత వేరే జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఎర్రుపాలెం మండలం జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ భూమిలో అక్రమంగా కొందరు నివాసాలు ఏర్పర్చుకున్నారు. గతంలో క్షేత్రస్థాయికి వెళ్లిన తమపై రాజకీయ ప్రోద్బలంతో ఆక్రమణదారులు భౌతికదాడులకు తెగబడ్డారని ఉద్యోగులు చెబుతున్నారు. నాటి కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేదని వాపోతున్నారు.అక్కడక్కడా ఆలయ భూములు కాజేస్తున్నారు.. తమ అనుచరులకు ఆలయ కమిటీల్లో చోటుకల్పించాలని రాజకీయ నాయకులు జోక్యం చేసుకుంటున్నారు.. ఇదేమని అడిగితే అధికారులు, సిబ్బందిపై దాడులకు ఉసిగొల్పుతున్నారు.. రాజకీయ ఒత్తిళ్లతో తాము సక్రమంగా విధులు నిర్వర్తించలేకపోతున్నామని దేవాదాయ శాఖ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో సర్వేకు వెళ్తున్నా ఆటంకాలు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా సరైన సహకారం అందటం లేదని ఆవేదన వెలిబుచ్చుతున్నారు.

మితిమీరుతున్న రాజకీయ జోక్యం

ఆలయాల ట్రస్టు బోర్డులకు సంబంధించి శాఖాపరమైన నోటిఫికేషన్ ఇస్తున్నా స్థానికంగా రాజకీయ అండదండలు కలిగిన వ్యక్తులే కమిటీల ఛైర్మన్లు, సభ్యులుగా ఎన్నికవుతున్నారన్నది బహిరంగ రహస్యం. దేవాదాయశాఖ అధికారులు ట్రస్టు బోర్డు నోటిఫికేషన్‌కు సంబంధించి ఈఓకు సమాచారమిస్తారు. ఆలయ నోటీసు బోర్డు, మండల, మున్సిపల్, నగరపాలక సంస్థ కార్యాలయాల్లో నోటిఫికేషన్ ప్రతులను అతికించడంతో పాటు దినపత్రికలకు ప్రకటనలను ఈఓలు ఇస్తారు. ఈవిషయంలోనూ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు జోక్యం చేసుకొని తమ అనుచరులు, అనుకూల వ్యక్తులకు పదవులు దక్కేలా ఒత్తిళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి.

విధులకు ఆటంకం కలిగించొద్దు

దేవాలయ భూముల ఆక్రమణల తొలగింపు, సర్వే వంటి అంశాల్లో చట్టప్రకారం అధికారులు, ఉద్యోగులు పనిచేస్తారు. స్థానిక రాజకీయ నాయకుల ప్రోద్బలంతో కొన్నిచోట్ల విధులకు ఆక్రమణదారులు ఆటంకం కలిగిస్తున్న మాట వాస్తవం. మా విధులు సక్రమంగా నిర్వర్తించేందుకు ప్రజలు, రాజకీయ నాయకులు సహకరించాలి. ఆలయాధికారులు, అర్చకులపై ఆరోపణలు వస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు.

# చెక్‌డ్యాంలకు మహర్దశ

ఖమ్మం : జిల్లాలోని మున్నేరు, ఆకేరు, పాలేరు, వైరా నదులు సహా పలు వాగులు, వంకలపై అడ్డు కట్టలు కట్టి నీటిని నిలిపేందుకు చెక్ డ్యాంల నిర్మాణానికి నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, పలు గ్రామాల రైతుల కోరిక మేరకు నీటిపారుదల శాఖ ఇంజినీర్లు ఆయా వాగులు, వంకలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం రూ.222 కోట్ల అంచనా వ్యయంతో 40 చెక్ డ్యాంల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలకు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల నుంచి సూత్రప్రాయంగా అనుమతి లభించటంతో సాంకేతిక అనుమతుల కోసం పూర్తిస్థాయి అంచనాలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. రెండు, మూడు రోజుల్లో సమగ్ర అంచనాలతో ప్రభుత్వ అనుమతికి పంపనున్నారు.ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో 5, పాలేరులో 7, వైరాలో 9, మధిరలో 7, సత్తుపల్లి నియోజకవర్గంలో 12 చొప్పున మొత్తం 40 చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. ఈ చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తయితే సుమారు 5 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. దీంతోపాటు ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలం పెరుగుతుంది. తాగు, సాగు నీటి అవసరాలు తీరుతాయి. పశువులకు తాగునీరు లభిస్తుంది. మత్స్య సంపద వృద్ధి చెందుతుంది. భూమి కోతకు గురవదు.

24 చోట్ల నిర్మాణం..మూడేళ్ల కిందట జిల్లాకు రూ.85.53 కోట్ల వ్యయంతో 25 చెక్‌డ్యాంలు మంజూరయ్యాయి. వీటిలో ఒకదాని నిర్మాణం కోర్టు కేసు వివాదంతో నిలిచిపోగా మిగతా 24 నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటి వరకు 16 నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. మిగతా 8 పనులు తుది దశకు చేరుకున్నాయి. వీటికింద 6,080 ఎకరాలకు సాగునీరు అందుతుంది. మొదటి దశలో 24 చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టాం. వాటి కింద బహుళ ప్రయోజనాలు చూసిన ఆయా ప్రాంతాల రైతులు, ప్రజాప్రతినిధులు కొత్తగా నిర్మించాలని కోరుతున్నారు. దీంతో రెండో విడతలో రూ.222 కోట్ల ప్రతిపాదనలతో 40 నిర్మాణాలకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించాం. నిధులు మంజూరు కాగానే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాం.

# ఆహా ఏమి రుచి.. దొరుకునురా ఉపాధి

ఖమ్మం : కేంద్ర మత్స్య సాంకేతిక సంస్థ (విశాఖపట్నం) పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో గ్రామీణ ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తులపై ఖమ్మంలోని టీటీడీసీలో ఈ నెల 1 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. చేపలు, రొయ్యల ఊరగాయలు, చేప వడియాలు, ఫిష్ కట్లెట్స్ ఇలా తొమ్మిది రకాల వంటల్లో మత్స్య సహకార సంఘాల సభ్యులకు మెలకువలు నేర్పారు. గిరిజన ఉప ప్రణాళిక పథకం కింద కేంద్ర మత్స్య సాంకేతిక సంస్థ, తెలంగాణ ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో తొలిసారిగా ఇక్కడ నిర్వహించారు. శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు, వివిధ రకాల వస్తువులు ఉచితంగా అందజేశారు.గ్రామీణ నిరుద్యోగ యువతకు తమ సంస్థ



ద్వారా చేపలు, రొయ్యలకు సంబంధించిన ఉప ఉత్పత్తుల తయారీలో ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ఇద్దరు అధికారులు, ఇద్దరు సహాయకులతో కూడిన బృందం శాస్త్రీయ పద్ధతుల్లో ఇచ్చిన శిక్షణతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

అహ్మద్‌బాషా, సీనియర్ సైంటిస్ట్, కేంద్ర మత్స్య సాంకేతిక సంస్థ

ఇప్పటి వరకు చేపల కూర, ఫ్రై చేయటం మాత్రమే తెలుసు. ఇక్కడ శిక్షణ తీసుకున్న తర్వాత చేపలు, రొయ్యల్లో తొమ్మిది రకాల వంటకాలను నేర్చుకున్నా. చేపలు, రొయ్యలను శుభ్రం చేయటం మొదలుకొని వంటకాల తయారీ వరకు తర్ఫీదు ఇచ్చారు. స్టాల్ ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందాలనుంది. భూక్యా అరుణ, కొమ్మినేపల్లిచేపలు, రొయ్యలతో రుచికరమైన వంటలు తయారుచేయటం నేర్చుకున్నా. ఉప ఉత్పత్తుల వల్ల ఉపాధి మెరుగుపడుతుందని భావిస్తున్నా. మాలాంటి నిరుద్యోగులకు ప్రభుత్వం రాయితీపై మొబైల్ వాహనాలు అందించాలి. స్టాల్స్ ఏర్పాటుకు సహకరించాలి.

భూక్యా నాగేంద్రబాబు, కొమ్మినేపల్లి

శిక్షణ పొందిన నిరుద్యోగులకు మత్స్యశాఖ ద్వారా అండగా నిలుస్తాం. మొబైల్ వాహనాలు, స్టాల్స్, ద్విచక్ర వాహనాలు తదితర వాటిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేటాయిస్తాం. మత్స్యశాఖ పథకాలు వర్తింపజేస్తాం. తర్ఫీదు పొందిన వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.ఆంజనేయ స్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి, ఖమ్మం

# సౌకర్యాలు కరవు.. సమస్యలు అనేకం

హనుమకొండ : వసతి గృహాల్లో సమస్యలు తిష్ట వేస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులు అసౌకర్యాల నడుమ చదవాల్సిన దుస్థితి నెలకొంది. వీటి నిర్వహణకు ప్రభుత్వం ఏటా రూ.కోట్లు వెచ్చిస్తున్నా.. క్షేత్రస్థాయిలో సమస్యలు తగ్గడం లేదు. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. తెల్లవారుజామున వరంగల్ జిల్లా నర్సంపేట సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలకు చెందిన 32 మంది విద్యార్థులు వాంతులతో అస్వస్థతకు గురికావడంతో.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకులాలు, వసతి గృహాల్లో బృందం పరిశీలన చేసింది.

మరుగుదొడ్లు సరిపడా లేవు

కమలాపూర్ బీసీ సంక్షేమ వసతి గృహంలో 60 మందికిపైగా విద్యార్థులున్నారు. గదుల కిటికీలకు దోమ తెరలు, జాలీలు చిరిగిపోయాయి. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. 60 మందికి మూడు మరుగుదొడ్లు ఉన్నాయి. వీటిని కూడా విద్యార్థులే వంతుల వారీగా ప్రతి శుభ్రపరుచుకు ంటున్నారు. సంఖ్యకు సరిపడా లేకపోవడంతో.. విద్యార్థులు ఇబ్బందులకు



గురవుతున్నారు. కమలాపూర్

అపరిశుభ్రంగా వంటగది

వరంగల్ మండలం ఆరెపల్లిలో ఎంజేపీ (బాలికల) కొత్తగూడ, ములుగు జిల్లా గురుకుల వసతి గృహంలో సుమారు 600 మంది విద్యార్థినీలున్నారు. ఈ ఏడాది నర్సంపేట బాలికల గురుకుల పాఠశాలను కూడా తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఈ రెండు గురుకుల పాఠశాలలు ఒకే అద్దె భవనంలో వేర్వేరుగా కొనసాగుతున్నాయి. వంట గదిలో శుభ్రతను పాటించడం లేదు. పరిశుభ్రంగా ఉంచి నాణ్యమైన భోజనం అందించాల్సిన గదిలో సిబ్బంది చెప్పులు దర్శనమిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ఇష్టం వచ్చినట్లు సిబ్బంది వ్యవహరిస్తున్నారు.

భీమారం

దోమల బెడదతో అనారోగ్యం

చిందర వందరగా వస్తువులు

జులైవాడలోని ప్రభుత్వ వసతి గృహంలో 253 మంది బాలికలున్నారు. ఆర్వో ప్లాంటు ద్వారా తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిపడా ఉన్నాయి. విద్యార్థినీలు నిద్రించేందుకు డబుల్ బెడ్స్‌ను ఏర్పాటు చేశారు. ఇవి దుమ్ముతో దారుణంగా ఉన్నాయి. దీంతో దోమలు పెరిగి జ్వరాల బారిన పడుతున్నారు. ఒక గదిలో 25 మంది నిద్రిస్తున్నారు. గదుల్లో ఫ్యాన్లు సరిగా తిరగకపోవడంతో.. సరిగా నిద్ర ఉండటం లేదని విద్యార్థులు వాపోతున్నారు. న్యూశాయంపేట

# తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు: సీఎం జగన్



తాడేపల్లి: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. "ఆధునిక తెలుగుభాషా వేత్తలలో అగ్రగణ్యుడు గిడుగు వెంకట రామమూర్తి గారు. తన ఉద్యమం ద్వారా తెలుగుభాషను సామాన్యుల దగ్గరకు చేర్చి.. వ్యవహారిక భాషను మాధ్యమంగా తీర్చిదిద్దిన గొప్ప వ్యక్తి. భాషా నైపుణ్యాలను వృద్ధిచేయడం ద్వారా అక్షరాస్యత పెంపు.. తద్వారా మానవాభివృద్ధికి విశేషంగా కృషిచేశారు" అని సీఎం జగన్ ట్వీట్ చేశారు. గిడుగు వారి జన్మదినాన్ని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు" అని సీఎం ట్వీటర్‌లో పేర్కొన్నారు.

# నాగార్జున వర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్




గుంటూరు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 39, 40 స్నాతకోత్సవాలు మంగళవారం జరిగాయి. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పీహెచ్‌డీ స్కాలర్స్‌కు డాక్టరేట్ పట్టాలు, బంగారు పథకాలను గవర్నర్ అబ్దుల్ నజీర్ అందించారు. అలాగే.. ప్రముఖ రచయిత, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్ ను గవర్నర్ నజీర్ ప్రదానం చేశారు.

# మినిస్టర్ రోజా భర్త సెల్వమణి మీద నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్



ఆంధ్ర ప్రదేశ్ మినిస్టర్ రోజా సెల్వమణి భర్త, దర్శకుడు అయిన ఆర్కే సెల్వమణి మీద నాన్ బెయిలబుల్ వారెంట్ ఇష్యూ అయింది. సెల్వమణి అంటే తమిళ సినిమా పరిశ్రమలో తెలియని వారుండరు, ఎన్నో విజయం సాధించిన సినిమాలకు దర్శకత్వం చేసాడు అతను. చెన్నైలోని జార్జ్‌టౌన్ కోర్టు ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. ఇంతకీ సెల్వమణి ఏమి చేసాడు, ఎందుకు కోర్టు అతనికి ఈ ఉత్తర్వులు ఇచ్చిందో తెలుసుకుందాం. సెల్వమణి ఎన్నో విజయవంతమైన చిత్రాలతో దర్శకుడిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నాడు, అయితే ఇప్పుడు అతను అంతగా సినిమాలు చెయ్యడం లేదు, పరిశ్రమకి దూరంగా వున్నాడు. ఇంతకీ అతనికి చెన్నై కోర్ట్ ఎందుకు ఇలాంటి ఉత్తర్వులు జారీ చేసింది అంటే, సెల్వమణి 2016 లో ఒక తమిళ ఛానల్ కి ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఆ ఇంటర్వ్యూ లో సినిమా ఫైనాన్షియర్ ముకుంద్ చంద్ బోత్రా ని కించపరిచే విధంగా మాట్లాడినట్టుగా అందుకు ఆ ఫైనాన్షియర్ కోర్టులో పరువునష్టం దావా వేసాడు. ఆ ఫైనాన్షియర్ ముకుంద్ కారణంగా తాను ఎన్నో ఇబ్బందులకు గురయ్యానని సెల్వమణి ఆ ఇంటర్వ్యూ లో చెప్పినట్టుగా ఆరోపణ, అందుకని ఆ ఫైనాన్షియర్ కోర్టుకి వెళ్లాడని తెలిసింది. ఆసక్తికరమైన అంశం ఏంటంటే కోర్టులో కేసు వేసిన ఫైనాన్సర్ ముకుంద్ బాత్రా మరణించగా, అతని కుమారుడు గగన్ బోత్రా ఆ కేసును కొనసాగించారు. ఈ కేసు సోమవారం చెన్నై కోర్టులోకి విచారణకి వచ్చినట్టుగా, దానికి సెల్వమణి హాజరు కావాల్సి వుంది, కానీ అతను హాజరు కాకపోవటంతో కోర్టు అతనికి నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారంట్ ఇష్యూ చేసినట్టుగా తెలిసింది. అతని లాయర్లు కూడా కోర్టుకి వచ్చి సమాధానం చెప్పని కారణంగా, చెన్నై లోని జార్జిటౌన్ కోర్టు సీరియస్ గా తీసుకొని ఈ అరెస్టు వారెంట్ జారీ చేసిందని తెలిసింది. ఇంతవరకు ఈ అరెస్టు విషయమై ఆంధ్ర ప్రదేశ్ మంత్రి, సెల్వమణి భార్య రోజా దీని మీద స్పందించలేదు, అలాగే ఆమె భర్త సెల్వమణి ఈ అరెస్టు వారెంట్ విషయమై ఎలా స్పందిస్తారో చూడాలి.

# ఏపీ పాలకుడికి ఎలాగూ తెలుగు అంటే ఆసక్తి లేదు: పవన్




అమరావతి: తెలుగు భాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, మాట్లాడే భాష... రాసే భాష ఒకటి కావాలని తపించి.. ఆ దిశగా వ్యవహారిక భాషోద్యమాన్ని నడిపిన గిడుగు వెంకట రామ మూర్తిని తెలుగు జాతి ఎన్నడూ మరువకూడదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తికి సభక్తికంగా అంజలి ఘటిస్తు న్నానన్నారు. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల భాషలోకి తీసుకువచ్చి మన మాతృభాషకు జీవంపోశారని పవన్ కొనియాడారు. ఆంధ్ర ప్రదేశ్ పాలకుడికి ఎలాగూ తెలుగు అంటే ఆసక్తి లేదని.. కాబట్టి ప్రజలే తెలుగు భాషను కాపాడుకొనే బాధ్యతను స్వీకరించాల న్నారు. తెలుగు భాష అభివృద్ధి కోసం ఏర్పాటైన ప్రభుత్వ విభాగాల పని తీరును గురించి ఎంత తక్కువ చెప్పుకొంటే అంత మంచిదని పవన్ కల్యాణ్ అన్నారు. వారు విడుదల చేసే ప్రకటనల్లోనూ, విద్యా శాఖ నుంచి వచ్చే ప్రకటనల్లో ఎన్ని అక్షర దోషాలు ఉంటున్నాయో చూస్తేనే తెలుస్తోందని, అలాంటి వారి నుంచి భాషా వికాసాన్ని ఆశించ లేమని అన్నారు. వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడైన గిడుగు వెంకట రామమూర్తి స్ఫూర్తిని తెలుగు భాషాభిమానులు, అధ్యాపకులు, సాహితీవేత్తలు అందిపుచ్చుకోవాలన్నారు. చిన్నారులు ఓనమాలు నేర్చుకొనే దశ నుంచే మన మాతృ భాషను దూరం చేసే విధంగా ఉన్న పాలకుల తీరు వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని పవన్ కల్యాణ్ పిలుపిచ్చారు.

# లోకేశ్ గురించి మాట్లాడుతూ భువనేశ్వరి తీవ్ర భావోద్వేగం




చిత్తూరు: టీడీపీ యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో దూసుకుపోతున్నారు. లోకేశ్ పాదయాత్రకు ప్రజాదరణ ఎంతగానో లభిస్తోంది. ప్రభుత్వం నుంచి ఎన్ని అవాంతరాలు ఎదురైనప్పటికీ అన్నింటినీ అధిగమిస్తూ లోకేశ్ ప్రజల్లోకి వెళ్తున్నారు. ఈ క్రమంలో లోకేశ్ పాదయాత్రపై తల్లి నారా భువనేశ్వరి తొలిసారి స్పందించారు. ఈ క్రమంలో భువనేశ్వరి తీవ్ర భావోద్వేగానికి గుర య్యారు. మంగళవారం కుప్పంలో పర్యటించిన చంద్రబాబు సతీమ ణి... ఓ మీడియా సంస్థకు ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ ఇచ్చారు. లోకేశ్ పాదయాత్ర నిర్వహించాలని భావించినప్పుడు ముందు ఆవేదనకు, ఆందోళనకు గురయ్యానని చెప్పుకొచ్చారు. తొలత పాదయాత్ర చేస్తుంటే తన కళ్ళ నుంచి నీళ్లు ఆపుకోలేకపోయానని తెలిపారు. లోకేశ్ తనకు ధైర్యం చెప్పిన తర్వాత తనలో మనోధైర్యం వచ్చిందన్నారు. ప్రస్తుతం పాదయాత్రలో లోకేశ్ రాటు తేలిపోయారని ఆనందం వ్యక్తం చేశారు. ఇక ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రజల కోసం లోకేశ్ పాదయాత్ర పూర్తి చేసి తీరతారన్నారు. పాదయాత్రలోనే కాదు వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ కుటుంబంపై ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ రాష్ట్రం కోసం, ఈ ప్రజల కోసం తమ కుటుంబం ప్రాణాలు వడ్డీ పోరాడుతోందన్నారు. ఈ పోరాటం ఇలాగే కొనసాగిస్తామని, వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా టీడీపీ అధికారంలోకి వస్తుందని నారా భువనేశ్వరి ధీమా వ్యక్తం చేశారు.

# మద్యంలో రూ. 50 వేల కోట్లు దోచారు: బోండా ఉమ




విజయవాడ: వైసీపీ నాయకులు చేస్తున్న ఇసుక దోపిడీపై నిరసన తెలుపుతూ మంగళవారం టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు బోండా ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో ఇసుక సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బోండా ఉమా మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుకను బంగారం చేశారని, ఇసుకలో వైసీపీ నేతలు రూ. 40 వేల కోట్లు దోసేశారని ఆరోపించారు.

వైసీపీ నేతల ఇసుక దోపిడీకి నిరసనగా 66 ఇసుక రీచ్‌లలో నిరసన కార్యక్రమాలు చేశామన్నారు. మద్యంలో రూ. 50 వేల కోట్లు దోచారని, కూరగాయల బండ్ల వద్ద కూడా ఆన్ లైన్ పేమెంట్లు ఉంటే మద్యం షాపులో ఎందుకు ఉండటం లేదని బోండా ఉమా ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్య మంత్రి మాత్రమే సంతోషంగా ఉన్నారన్నారు. ఒక బటన్ ద్వారా పది రూపాయలు ఇస్తూ.. ఇంకో బటన్ ద్వారా వంద రూపాయలు లాగేస్తున్నారని బోండా ఉమా మహేశ్వరరావు ఆరోపించారు.

# మరో వెయ్యి కోట్లు అప్పు తెచ్చిన ఏపీ ప్రభుత్వం



అమరావతి: ఏపీ ప్రభుత్వం మరో వెయ్యికోట్లు అప్పు తెచ్చింది. 11 సంవత్సరాలకు 7.45 శాతం వడ్డీతో మంగళవారం సెక్యూరిటీ బాండ్ల వేలం వేసింది. ఆర్‌బీఐ దగ్గర 5 నెలల కాలంలో 35 వేల 500 కోట్ల రూపాయలు అప్పు తెచ్చి ఏపీ సర్కార్ రికార్డ్ సృష్టించింది. మళ్లీ అప్పు కోసం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ చుట్టూ రాష్ట్ర అధికారులు తిరుగుతున్నారు. ఒకటోవ తేదీన ఉద్యోగుల జీతాలు ఇవ్వాల్సి ఉండటంతో మళ్లీ అప్పు కోసం ఢిల్లీలో ప్రయత్నాలు చేస్తున్నారు. సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారానే 35 వేల 500 కోట్ల రూపాయలు అప్పుగా తీసుకురావడంతో ఆర్థిక నిపుణుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము తక్కువ అప్పులు తెచ్చామని ఇప్పటికీ బహిరంగ సభల్లో ముఖ్యమంత్రి జగన్ చెబుతున్నారు. మరోవైపు అడిగినప్పుడల్లా అప్పు ఇస్తూ కేంద్రం ఆదుకుంటుంది.




# ఎల్‌పీజీ ధర రూ.200 తగ్గింపు..

న్యూఢిల్లీ: వంటగ్యాస్ సిలెండర్ ధరను తగ్గిస్తూ ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ మంగళవారంనాడు కీలక నిర్ణయం తీసుకుంది. సిలెండర్ ధర రూ.200 తగ్గించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించినట్టు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మంగళవారంనాడిక్కడ మీడియా సమావేశంలో వెల్లడించారు.

తాజా తగ్గింపుతో పీఎం ఉజ్వల యోజన కింద పంపిణీ చేసే సిలెండర్లపై సబ్సిడీ రూ.400కు పెరిగింది.

ఉజ్వల స్కీమ్ కింద గృహావసరాలకు వినియోగించే సబ్సిడీ ఎల్‌పీజీ సిలెండర్లను ఏడాదికి 12 వరకూ తీసుకోవచ్చు. 14.2 కిలోల ఎల్పీజీ సిలెండర్ ధర ప్రస్తుతం ఢిల్లీలో రూ.1,103గా ఉందని ఇండియన్ ఆయిల్ కంపెనీ తెలిపింది.

**ప్రధాని 'రాఖీ' పండుగ కానుక :** డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలెండర్ల ధర రూ.200 తగ్గించాలని ప్రధాన మంత్రి మోదీ నిర్ణయం తీసుకున్నారని, రక్షాబంధన్ కానుకగా దేశంలోని మహిళలందరికీ మోదీ ఇచ్చిన కానుక ఇదని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు.

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ సహా మొత్తం 5 రాష్ట్రాలకు త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎల్పీజీ సిలెండర్ ధరను కేంద్రం తగ్గించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఏపీలో అరాచక పాలన చేస్తున్న జగన్మోహన్‌రెడ్డి

ప్రకాశం : ఏపీలో జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలన చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మంగళవారం నాడు ప్రకాశం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని జగన్ పాతిపెట్టారని మండిపడ్డారు. సీఎం జగన్ రాబోయే ఎన్నికల్లో అక్రమ పద్ధతుల్లో గెలవడానికి అన్ని రకాల అవకతవకలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే వైసీపీని గద్దె దించాలని సూచించారు. జగన్‌ను ఎంత తొందరగా గద్దె దించితే ఏపీకి అంత మంచిదన్నారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా పనిచేయాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా చేసిన రమేష్ తన ఓటును పరిశీలించుకున్నారంటే ఎన్నికల కమిషన్ తలదించుకోవాలని రామకృష్ణ తెలిపారు.

# ఎన్టీఆర్ స్మారక నాణెం ధర ఎంత?.. ఎలా కొనుగోలు చేయాలంటే..




దిల్లీ: కేంద్ర ఆర్థిక శాఖ ముద్రించిన ఎన్టీఆర్ శతజయంతి రూ.100 నాణెం ధరను రూ.4,850 (చెక్క డబ్బాతో), రూ.4,380 (ప్రూఫ్ ఫోల్డర్ ప్యాక్), రూ.4,050 (యూఎన్‌సీ ఫోల్డర్ ప్యాక్)గా నిర్ణయించారు. 50% వెండి, 40% రాగి, 5% జింక్, 5% నికెల్ మిశ్రమంతో తయారుచేసిన ఈ నాణెం మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 'ఇండియా గవర్నమెంట్ మింట్' వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో లేదా హైదరాబాద్‌లోని సైఫాబాద్, చెర్లపల్లిల్లోని మింట్ విక్రయ కౌంటర్లలో నేరుగా కొనుగోలు చేయొచ్చు.

ఈ మేరకు హైదరాబాద్‌లోని ప్రభుత్వ నాణేల ముద్రణ కేంద్రం (ఇండియా గవర్నమెంట్ మింట్) చీఫ్ జనరల్ మేనేజర్ వీఎన్ఆర్ నాయుడు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'జాతి చరిత్రపై చెరగని ముద్రవేసిన దిగ్గజ వ్యక్తులకు నివాళులర్పిస్తూ ఇలాంటి స్మారక నాణేలను ముద్రిస్తారు. ఈ నాణెం ఎన్టీఆర్ అసాధారణ సేవలకు నివాళులర్పిస్తుంది. ఆయన అభిమానులు నాణేన్ని సొంతం చేసుకొని చారిత్రక ఘట్టంలో భాగస్వాములు కావాలి' అని పిలుపునిచ్చారు. నాణేన్ని అభిమానులందరికీ అందుబాటులోకి ఉంచడానికి వీలుగా వ్యక్తిగత డిమాండ్లపై పరిమితులు ఉంచుతున్నట్లు తెలిపారు. కావాల్సిన వారు https://www.indiagovtmint.in/en/commemorative-coins/ ద్వారా ఆన్‌లైన్‌లో పొందవచ్చని సూచించారు.

# చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుంది: మంత్రి మేరుగు



తిరుపతి: చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని మంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు. మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని మంత్రి దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 14 ఏళ్లు సీఎంగా ఉండి చంద్రబాబు ఏపీకి చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో 60 లక్షల దొంగ ఓట్లు చంద్రబాబు సృష్టించారు. అర్హత ఉన్న ఓట్లు ఉండాల్సిందే. కుప్పంలో చంద్రబాబు దొంగ ఓట్లతో గెలిచారని ధ్వజమెత్తారు. సీఎం జగన్ బాధ్యతల స్వీకరించిన తర్వాత సామాజిక విప్లవానికి తెర తీశారని, రాష్ట్రంలో ఎక్కడా కూడా అసమానతలు లేకుండా చేశారని కొనియాడారు. పేద ప్రజల గుండెచప్పుడుగా పరిపాలన జరుగుతోందన్నారు. గతంలో లేనివిధంగా ఒక లక్ష 50 వేల కోట్ల రూపాయలు డిబిటి రూపేనా సీఎం జగన్ అందించారన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రజలకు ఒక మంచి పని కూడా చేయలేదన్నారు.. ప్రజలను మోసం చేసేందుకు, ఏమార్చేందుకు చంద్రబాబు తిరుగుతున్నారని మండిపడ్డారు. కరోనా సమయంలో రాష్ట్రాన్ని వదిలి వెళ్ళిపోయిన చంద్రబాబు.. మళ్లీ రాష్ట్రంలో రాజకీయాలు చేసేందుకు వస్తున్నారని మంత్రి దుయ్యబట్టారు.

# మా హరి మావయ్య! నిబద్ధతకు నిలువెత్తు రూపం



అమరావతి: దివంగత టీడీపీ నేత హరికృష్ణ వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ నివాళు లర్పించారు. తన మామయ్య హరికృష్ణతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా యువనేత గుర్తుచేసుకున్నారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. "మా హరి మావయ్య! నిబద్ధతకు నిలువెత్తు రూపం. దూకుడు ఆయన నైజం, కోపం తాత్కాలికం, ప్రేమ శాశ్వతం. మేనల్లుడిగా ఆయన ఆత్మీయత పొందడం నా అదృష్టం. తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యునిగా, ఎమ్మెల్యేగా, రాజ్యసభ సభ్యునిగా చేపట్టిన పదవులకే వన్నె తెచ్చిన నందమూరి హరికృష్ణ గారు లేని లోటు ఎవరు తీర్చలేనిది. హరి మావయ్య వర్ధంతి సందర్భంగా ఆయన స్మృతికి నివాళులు అర్పిస్తున్నాను" అని లోకేశ్ ట్వీట్ చేశారు.

## చీరందంలో నీలాంబరి సొగబులు

వెటరన్ నటీమణుల్లో రమ్యకృష్ణ సమ్ థింగ్ స్పెషల్.రేర్ గా సోషల్ మీడియాలో రమ్యకృష్ణ ఫోజులు ఆమెని సీనియర్ భామల నుంచి వేరు చేస్తుంటాయి. నవతరం నాయికలకు ఏ మాత్రం తగ్గకుండా యువతని ఆకర్షిస్తుంటారు. తాజాగా రమ్యకృష్ణ సంప్రదాయ చీరందంలో తళుక్కున మెరిసారు. ఇదిగో ఇక్కడిలో షోల్డర్ లెస్ డిజైన్డ్ బ్లౌజ్ లో గ్రీన్ కలర్ సారీలో వావ్ అనిపిస్తున్నారు. ఆమె ఎంపిక చేసుకున్న మ్యాచింగ్ ఎక్సరసీస్..పెదాలపై సన్నని నవ్వు...కళ్లలో భావాలు..స్కిన్ టోన్ రమ్యకృష్ణని కొత్తగా ప్రజెంట్ చేస్తున్నా యి. 50 ఏళ్లు పై బడిన అదే అందంతో ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. ఆమె అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు గుప్పిస్తున్నారు. సీనియర్ బ్యూటీ ఇలా చీరందంలో మెరవడం కొత్తేం కాదు. ఇన్ స్టా ద్వారా ఎప్పటికప్పుడు



సంప్రదాయ దుస్తుల్లో మెరుస్తుంటారు. ఆమె సెకెండ్ ఇన్నింగ్స్ లో దూసుకుపో తున్నారంటే? ఇలాంటి ఎలివేషన్లు కూడా కొంతవరకూ కలిసొస్తున్నాయనొచ్చు. ప్రతిభ ఒక్కటే సరిపోదు. అప్పుడప్పుడు ఇలా టచ్ లో ఉంటేనే? అవకాశాలు వస్తాయని తన సీక్రెట్ ని ఇలా రివీల్ చేస్తున్నారు. ఇటీవలే రంగమార్తాండ సినిమాలో ఓ కీలక పాత్రతో మెప్పించిన సంగతి తెలిసిందే. ఈ పాత్ర ఆమెకి ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చింది. అంతకు ముందు లైగర్ బంగార్రాజు రొమాంటిక్ చిత్రాల్లో మామ్ పాత్రలతో ఆకట్టుకున్నారు. 50 ఏ ళ్లు పైబడిన నటి ఇంకా తెలుగు సినిమాల్లో యాక్టివ్ గా ఉన్నారంటే? అదంగా ఆమె గొప్పతనమే. తనకోసం అంటూ దర్శకులు కొన్ని పాత్రలు సృష్టిస్తున్నారు. వాటిని తెలివిగా ప్రతిభతో సద్వినియోగం చేసుకుంటున్నారు. రమ్యకృష్ణ తరం హీరోయిన్లు చాలా మంది రిటైర్మెంట్ తర్వాత వేర్వేరు రంగాల్లో స్థిరపడ్డారు. కానీ నీలాంబరి మాత్రం నాగార్జున లాంటి హీరోకి అప్పుడప్పుడు భార్య పాత్రలు పోషిస్తున్నారంటే? అందంతా ట్యాలెంట్ తోనే సాధ్యమనాలి. అంతకు ముందు బాహుబలిలో శివగామి పాత్రతో పాన్ ఇండియనే షేక్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ కథానాయకుడిగా నటిస్తోన్న గుంటూరు కారంలో నటిస్తున్నారు.

## ఫేమస్ అవ్వడం కోసం పెదవి ముద్దులివ్వలేదు! తమన్నా

'లస్ట్ స్టోరీస్ -2' కోసం మిల్కీ బ్యూటీ ఇంటిమేట్ సన్నివేశాల్లో చెలరేగిన సంగతి తెలిసిందే. విజయ్ వర్మతో అమ్మడు లిప్ లాక్ సన్నివేశాలు అంతటా కాకపుట్టిస్తున్నాయి. బాలీవుడ్ కన్నా తెలుగులో ఫేమస్ అయిన బ్యూటీ! ఏనాడు తెలుగు తెరపై ఇంతలా చెలరేగింది లేదు. 18 ఏళ్ల పాటు తమన్నా విధించుకున్న నో లిప్ కిస్ పాలసీని లస్ట్ స్టోరీస్ కోసం పక్కనబెట్టేసి చేసింది. ఈ నేపథ్యంలో తమన్నా కొన్ని విమర్శలు ఎదు ర్కుంది. ఇంత కాలం పెదవి ముద్దులు ఇవ్వని తమన్నా ఇలా ఎందుకు బోర్డర్ దాటినట్లు? విజయ్ వర్మ పెళ్లి చేసుకుంటేందనే రీజన్ తోనే? ఇలా చేసిందా? అంటూ కొన్ని కామెంట్లు వైరల్ అయ్యాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అమ్మడు వాటన్నింటిపై వివరణ ఇచ్చే ప్రయత్నం చేసింది. సుజోయ్ ఘోష్



తో వర్క్ చేయాలని నేను ఎప్పటి నుంచో అనుకుంటున్నాను. ఇలాంటి సబ్జెక్ట్ లో ఆయన దర్శకత్వంలో నటించడం ఆనందంగా ఉంది. ఒకప్పుడు పరిస్థితులు వేరు. ఇప్పుడు వేరు. కాలానికి అనుగుణంగా మారే వ్యక్తుల్లో నేను ఒకదాన్ని. ఒక నటిగా సృజనాత్మకత కోసం ఈ నిర్ణయం తీసుకున్నా. సినిమా పరిశ్రమకొచ్చి 18 ఏళ్లు అయిన తర్వాత ఫేమస్ అవ్వాల్సిన అవసరం లేదు. ఫేమస్ అవ్వడం కోసం లిప్ కిస్ సన్నివేశాల్లో నటించాల్సిన అవసరం లేదు' అని తెలిపింది. తమన్నా గ్లామర్ సన్నివేశాల్లో చాలా సినిమాల్లో నటించింది. వెండి తెరపై స్కిన్ షో తో మెప్పించిన సందర్భాలెన్నో ఉన్నాయి. అయితే ఆ ముద్దు కేవలం విజయ్ వర్మ ఉండటం వల్లే సాధ్యమైందా? విజయ్ వర్మ స్థానంలో మరో నటుడు ఉన్నా? తమన్నా అలాంటి సన్నివేశంలో నటించేదా? అన్న దానిపై మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. ఇక తమన్నా తెలుగు సినిమా సంగతి చూస్తే ప్రస్తుతం కొన్ని కొత్త ఛాన్సులు క్యూలో ఉన్నట్లు సమాచారం.




## 'హీరోయిన్లు' ఇద్దరు అవకాశ వాదులా?





విజయ్ ఫాన్స్ ఆ హీరోయిన్స్ అని ఆన్లైన్ వేదిక గా ట్రోల్ చేస్తున్నారు తలపతి విజయ్ కి హాట్ బ్యూటీలు రష్మిక మందన్నా..పూజాహెగ్డేలు విపరీతమైన అభిమానులు. సౌత్ లో తమ అభిమాన హీరోలు ఎవరంటే? విజయ్ పేరు చెబుతారు. రష్మిక అయితే ఏకంగా తన లవ్ అని కూడా అంది. ఇద్దరు విజయ్ తో సినిమాలు చేసారు. వారసుడు సినిమా చేస్తున్న సమయంలో రష్మిక విజయ్ ని ఎలా ఆకాశానికి ఎత్తేసేదో పాత పోస్ట్ లు చూస్తే తెలుస్తుంది. అలాగే బీస్ట్ సమయంలో పూజాహెగ్డే కూడా అంతకు మంచి విజయ్ ని ఉద్దేశించి పోస్ట్ లు పెట్టేది. ఆ సినిమా ప్రమోషన్ కోసం వ్యక్తిగతంతో చాలా హంగామా చేసింది. ఆ హీరో బర్త్ డే సందర్భంగా ఇద్దరు భామలు చేసిన హడావుడి గురించైతే చెప్పాల్సిన పనిలేదు. ఓ ఫ్యామిలీ మెంబర్ ని మించి ట్రీట్ చేసి శుభాకాంక్షల వెల్లువ కురిపించారు. అయితే తాజాగా జూన్ 22 విజయ్ తన 49వ పుట్టిన రోజును జరుపుకున్నాడు. ఈ సందర్భంగా ఇండస్ట్రీ నుంచి అభిమానుల నుంచి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఇది ఎప్పుడు సహజంగా జరుగుతుంది కాబట్టి దీన్ని పెద్దగా హైలైట్ చేయాల్సిన పనిలేదు. అయితే రష్మిక మందన్న..పూజాహెగ్డే మాత్రం ఈసారి తలపతికి కనీసం పుట్టిన రోజు శుభాకాంక్షలు కూడా చెప్పలేదు. విజయ్ తో సినిమా చేస్తున్న సమయంలో పుట్టిన రోజు విషెస్ తో పాటు ఆ సినిమా పోస్టర్లను భామలిద్దరు సోషల్ మీడియాలో వైరల్ చేయడంలో కీ రోల్ పోషించారు. కానీ ఇప్పుడు మాత్రం సైలెంట్ అయిపోయా రు. అయితే పూజాహెగ్డే మాత్రం బర్త్ డే అయిపోయిన రెండు రోజులకు ఏదో ఓ డాన్స్ వీడియో మెక్కు బడిగా షేర్ చేసింది. అందులోనూ ఎలాంటి బీ లేటెడ్ విషెస్ కూడా పోస్ట్ చేయలేదు. ఇక రష్మిక అయితే కనీసం పత్తా కూడా లేదు. దీంతో సోషల్ మీడియాలో విజయ్ అభిమానులు వాళ్లిద్దర్ని ట్రోల్ చేయడం పనిగా పెట్టుకున్నారు. సినిమా చేస్తున్నప్పుడే ఆ హీరోతో భజన చేస్తారా? హీరోలు అప్పుడే గుర్తొస్తారా? సినిమాలు చేయకపోతే గుర్తు రారా? అంటూ ఆడేసుకుంటున్నారు. వెబ్ మీడియాలో ఇలాంటి కామెంట్లు..ట్రోలింగ్ లు సహజమే అనుకోండి.

## రణవీర్ అలియా.. కిస్సు వరకు వచ్చేశారు..



బాలీవుడ్ హీరో రణవీర్ సింగ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ జంటగా నటించిన చిత్రం రాకీ ఔర్ రాణి. లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్ ట్రైనర్ గా ఈ సినిమా తెరకెక్కిస్తున్నారు. కరణ్ జోహార్ ఈ సినిమా దర్శక నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫ్యామిలీ సినిమాలు చేయడంలో కరణ్ జోహార్ ది అందవేసిన చేయి. కాగా చాలా కాలం తర్వాత ఆయన నుంచి వస్తున్న సినిమా ఇది కావడం విశేషం. ఇటీవల ఈ మూవీ టీజర్ ని బాలీవుడ్ బాద్షా షారూఖ్ ఖాన్ విడుదల చేయడం విశేషం.టీజర్ చాలా కొత్తగా ఆకట్టుకునేలా ఉంది. ఈ టీజర్ ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది. టీజర్ విడుదలైన మొదటి గంట లోనే దాదాపు రెండు లక్షల 50 వేల వ్యూస్ వచ్చాయి. దీంతో ఈ మూవీపై ప్రేక్షకులు ఎంత ఆసక్తిగా ఉన్నారో తెలుస్తోంది.ాగా ఈ మూవీ లో స్పెషల్ గా అలియా రణవీర్ కెమిస్ట్రీ టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. వీరిద్దరి కెమిస్ట్రీ మూవీ కి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర బృందం చెబుతోంది. కేవలం టీజర్ లోనే ఇంత బాగుంది అంటే మొత్తం మూవీ చూస్తే వీరి పెయిర్ కి అందరూ ఫిదా అయిపోవడం ఖాయమని మూవీ టీం ధీమా వ్యక్తం చేస్తోంది.

నిజంగా బయట కు మూవీ పోస్టర్లు చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. తాజాగా ఓ ఫోటో వారి అభిమానుల ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. అందులో అలియా నీలం రంగు చీర కట్టుకొని ఉండగారణవీర్ నీలం రంగు చొక్కా ధరించి ఉన్నారు. ఏదో పాట లోని క్లిప్ అని అర్థమౌతోంది. వారిద్దరూ సన్నిహితంగా ఉన్న ఫోటో ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. ఇదిలా ఉండగా పెళ్లి తర్వాత అలియా చేస్తున్న సినిమా ఇది కావడం విశేషం. పెళ్లైన వెంటనే ఆమె తల్లి కావడం ఆడ బిడ్డకు జన్మనిచ్చారు. డెలివరీ సమయం లో కాస్త బొద్దుగా మారిన అలియా ఆ తర్వాత చాలా తక్కువ కాలంలో ఫిట్ గా మారడం విశేషం. ఇక ఈ మూవీ టీజర్ లో అలియా చాలా అందంగా కనిపించింది. టీజర్ మొత్తం రంగు రంగుల చీరల్లో కనిపించి ఆకట్టుకుంది. నిమిషం పాటు ఉన్న ట్రైలర్ లో ఆమె దాదాపు 20చీరల్లో కనిపించడం విశేషం. కాగా గతంలో రణవీర్ అలియా కాంబినేషన్ లో గల్లి బాయ్స్ సినిమా లో నటించారు. ఈ సినిమా బ్లాక్ బస్టర్ అయ్యింది. వీరి పెయిర్ కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయ్యాయి. వీరిద్దరి కాంబినేషన్ లో వస్తున్న రెండో చిత్రం ఇది కావడం విశేషం. అలాగే దర్శకుడు కరణ్ జోహార్ కూడా దాదాపు 7 సంవత్సరాల తర్వాత ఈ మూవీ తో మెగా ఫోన్ పట్టడం గమనార్హం.

## గన్ షూటింగ్ కోసం 6 నెలలు శిక్షణ తీసుకున్నా

నిఖిల్ సరసన స్పై చిత్రంలో నటించింది ఐశ్వర్య మీనన్. ప్రముఖ ఎడిటర్ గ్యారీ బిహెచ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ సినిమాని చరణ్ తేజ్ ఉప్పలపాటి- రాజ శేఖర్ రెడ్డి భారీ స్థాయిలో నిర్మించారు. టీజర్ ట్రైలర్ ఆకట్టుకున్నాయి. జూన్ 29న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా తాజా ఇంటర్వ్యూలో ఐశ్వర్య మీనన్ తెలిపిన సంగతులివి. స్పై నా మొదటి తెలుగు సినిమా. నా తొలి పరిచయం ఒక కలలాంటిది. దర్శకుడు గ్యారీ బిహెచ్ ఈ సినిమా సైన్ చేయగానే నన్ను హీరోయిన్ గా అనుకున్నారు. ఈ కథ ఆయన చెప్పగానే విని థ్రిల్లయ్యాను. రెండో ఆలోచన లేకుండా సంతకం చేసాను. ఈ చిత్రంలో నా పాత్ర యాక్షన్ - స్టంట్స్ చేయాలి. రా ఏజెంట్ గా కనిపించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకున్నాను. గన్ షూటింగ్ లో దాదాపు ఆరు నెలలు శిక్షణ తీసుకున్నాను. రా ఏజెంట్ గా కనిపించాలంటే దానికోసం చాలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలుసుకున్నా. ఆసక్తికర ప్రయాణమిది. ఎలాంటి గుర్తింపుని ఆశించకుండా దేశానికి సేవ చేసే 'రా' వింగ్ గురించి తెలుసుకుని ఆశ్చర్యపోయాను. నేను స్టంట్స్ నేర్చుకున్నాను కాబట్టి యాక్షన్ సినిమాలపై ఇక నమ్మకం పెరిగింది. స్పై 2 తెరకెక్కేందుకు ఛాన్సుంది.



ఒకవేళ సీక్వెల్ తీస్తే నాకే అవకాశం ఇవ్వాలని కోరుతున్నా. నిఖిల్ గురించి చెప్పాలంటే అతడు తెలివైన నటుడు. హ్యాపీ డేస్ నుంచి తన పనిని చూస్తున్నాను. ఆయన కథల ఎంపిక చాలా బాగుంటుంది. చాలా పాజిటివ్ పర్సన్ . చాలా ఎనర్జిటిక్. తనతో కలిసి నటించడం సౌకర్యంగా ఉంటుంది. సాంకేతిక నిపుణుల్లో శ్రీచరణ్ పాకాల గారు నేపథ్య సంగీతం ఆకట్టుకుంటుంది. ఆయన తూ ముజే ఖూన్ థో పాట చేశారు. అలాగే విశాల్ చంద్రశేఖర్ రెండు పాటలు చేశారు. స్పై సంగీతం అద్భుతంగా కుదిరింది. సవాళ్ల గురించి మాట్లాడాలంటే...? రా ఏజెంట్ గా కనిపించడం ఒక సవాల్ లాంటిది. ఇదివరకూ నేను ఇలాంటి యాక్షన్ సినిమాలు చేయలేదు. కదలికలు.. ఫైటింగ్స్... యాటిట్యూడ్ అన్నీ రా ఏజెంట్ లా సహజంగా ఉండేలా చూసుకోవడం ఛాలెంజింగ్. విజువల్స్ చూసుకున్నాక నాపై నాకు నమ్మకం పెరిగింది. ఇంజనీరింగ్ చేసి నటిని అయ్యాను. ఈ రంగంలో ఊహించుకోలేదు. నేను ఎప్పుడూ హీరోయిన్ అవుతానని అనుకోలేదు. ఆరంభంలో చిన్న చిన్న ప్రకటనలు చేశాను. ఒకొక్క అడుగువేసి ఇక్కడి వరకూ వచ్చాను. ఈ ప్రయాణం సంతోషాన్నిస్తోంది. భవిష్యత్ లో అన్నిరకాల పాత్రల్లో నటిస్తాను. అలియా భట్ చేసిన హైవే తరహా పాత్రలు పోషించాలని వుంది. నాకు అందరు హీరోలతో అవకాశాలు కావాలి. తదుపరి యూవీ క్రియేషన్స్ నిర్మాణంలో కార్తికేయ హీరోగా ఒక సినిమా చేస్తున్నా. ఇతర భాషల్లోను అవకాశాలొస్తున్నాయి... అని చాటింగ్ ముగించారు.

## సూపర్ హాట్ పిక్స్ తో మతిపోగొడుతున్న రకుల్

కెరటం సినిమా తో తెలుగు సినిమా ఇండస్ట్రీ లో 2011 అడుగు పెట్టిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. తెలుగు లో ఈ అమ్మడి సినీ ప్రస్థానం వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ సినిమా తో టర్న్ తీసుకుంది. ఆ సినిమా విజయాన్ని సొంతం చేసుకోవడంతో వరుసగా సినిమాల్లో ఆఫర్లు రావడం జరిగింది. దాంతో రకుల్ స్టార్ హీరోయిన్ గా నిలిచింది. తెలుగు సినిమా ఇండస్ట్రీ లో దాదాపు నాలుగు అయిదు సంవత్సరాల పాటు చాలా బిజీ గా కెరీర్ ను కొనసాగించిన రకుల్ ప్రీత్ సింగ్ ఆఫర్లు తగ్గుతున్న సమయంలో మెల్లగా బాలీవుడ్ లో ప్రయత్నాలు మొదలు పెట్టింది. దాంతో అక్కడ వరుసగా పెద్ద సినిమాల్లో ఛాన్స్ లు దక్కాయి. కానీ అక్కడ ఇప్పటి వరకు కమర్షియల్



గా సక్సెస్ లను సొంతం చేసుకోలేక పోయింది. హీరోయిన్ గా రకుల్ ప్రీత్ సింగ్ ఎంత బిజీ గా ఉన్నా సోషల్ మీడియా లో అందాల ఆరబోత ఫోటోలు మరియు వీడియోలు రెగ్యులర్ గా షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి ఈ ఫోటోల ను షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నడుము అందం చూపిస్తూ రకుల్ చేసిన ఈ షో అందరిని ఆకట్టుకుంటోంది.

రకుల్ ప్రీత్ సింగ్ యొక్క ఈ సూపర్ హిట్ పిక్స్ సూపర్ అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. రకుల్ ప్రీత్ సింగ్ యొక్క స్కిన్ షో ఫోటోలు ఎప్పుడు షేర్ చేసినా కూడా వైరల్ అవుతూనే ఉంటాయి. అయితే ఈసారి ఫుల్ డ్రెస్ లో కనిపించినా కూడా వావ్ అంటూ అంతా కూడా తెగ లైక్స్ చేస్తున్నారు. ప్రస్తుతం సౌత్ లో సినిమాలు ఏమీ చేయని ఈ అమ్మడు హిందీ లో మాత్రం వరుసగా సినిమాల్లో నటిస్తోంది. ఓటీటీ సినిమాలు మరియు సిరీస్ లతో ఈ అమ్మడు మరింత బిజీ గా మారింది. ముందు ముందు మళ్లీ సౌత్ లో ముఖ్యంగా తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడు సినిమాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు.

గరుడ వార్త






**జోరుగా సాగుతున్న విక్రయాలు** : రక్షాబంధన్ వేళా రాఖీలు కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా మారాయి. హైదరాబాద్‌లో రాఖీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా సాగే ఈ పండగ నాడు సోదరులకు కట్టేందుకు అందమైన రాఖీలు మార్కెట్లోకి వచ్చాయి. చిన్నారుల మనసు నచ్చే కార్టూన్ రాఖీలు మొదలు కొని, పర్యావరణహిత రాఖీల వరకు ఎన్నో రకాలు కనువిందు చేస్తున్నాయి.

## యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి: ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో టాస్క్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఐటీ జాబ్‌మేళాను ఎమ్మెల్సీ కవిత ప్రారంభించారు. జాబ్‌మేళాకు పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చారు. ఇందులో గ్లోబల్ లాజిక్‌తోపాటు వివిధ విదేశీ కంపెనీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా ప్రఖ్యాతి చెందిన 41 కంపెనీలు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. జాబ్‌మేళాలో వికలాంగులకు రిజర్వేషన్లు కల్పిస్తున్నామని చెప్పారు. గత జాబ్‌మేళాలో ముగ్గురు దివ్యాంగులకు ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. యువత కోసం ఇలాంటి జాబ్‌మేళాలు నిర్వహించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ అన్నారు. గ్రామీణ యువతకు ఇది గొప్ప అవకాశమని చెప్పారు. ప్రతి నెలా ఇలాంటి



జాబ్ మేళాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే గణేశ్ గుప్తా అన్నారు. ఎమ్మెల్సీ కవిత సహకారంతో ఎన్నో విదేశీ కంపెనీలు ఇక్కడికి వచ్చాయన్నారు.

## కాంగ్రెస్ పార్టీవి ఆచరణ సాధ్యం కాని హామీలు: మంత్రి తలసాని



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చే హామీలన్నీ ఆచరణ సాధ్యం కానివేనని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అది ఏమన్నా కొత్త పార్టీయా అని ప్రశ్నించారు. వారి చరిత్ర ఎవరికి తెలయదని, ఆ పార్టీని తెలంగాణలోని కానీ, దేశంలో కానీ ఎవరూ నమ్మే స్థితిలో లేరని విమర్శించారు. హైదరాబాద్ గోషామహల్‌లో బీసీ కులవృత్తిదారులకు ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఓట్లు దండుకోవడం తప్ప ఏరోజూ ప్రజల గురించి కాంగ్రెస్ ఆలోచించలేదన్నారు. 50 ఏండ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించారని, అప్పుడు పేదలకు పెన్షన్లు ఇవ్వాలనే ఆలోచన రాలేదా అని నిలదీశారు. గృహలక్ష్మి పథకంలో భాగంగా ఇండ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.3 లక్షలు ఇస్తుంటే.. వాళ్లు రూ.6 లక్షలు ఇస్తామని చెప్పడం ఎంతవరకు సబబన్నారు. ఆ పార్టీ నాయకులు కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారం కోసం ఊకదంపుడు ఉపన్యాసాలు, అలవికాని హామీస్తున్నారని విమర్శించారు. కర్ణాటక ఎన్నికల్లో కూడా ఇలాంటి హామీలే ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత చేతులెత్తేశారని చెప్పారు. ఆ పార్టీ ప్రకటించే డిక్లరేషన్లు కనీసం మూతి తూడ్చుకోవడానికి కూడా పనికిరావని ఎద్దేవా చేశారు. అన్నివర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషిచేస్తున్నారని చెప్పారు. వచ్చే నెల 2న 12 వేల డబుల్‌బెడ్ రూం ఇండ్లు పంపిణీ చేస్తామని వెల్లడించారు.

## నన్ను ఓడిస్తారట.. డబ్బు సంచులతో దిగుతున్నారంటూ సీతక్క కీలక వ్యాఖ్యలు

ములుగు: "నన్ను ఓడిస్తామని డబ్బు సంచులతో దిగుతున్నారు" అంటూ ఎమ్మెల్యే సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాసేవకు– డబ్బు సంచులకు మధ్య యుద్ధం మొదలైందన్నారు. తాను ఎక్కడా భూకబ్జాలకు పాల్పడలేదని, అక్రమ కేసులు పెట్టించలేదని ఎవరిని ఇబ్బంది పెట్టలేదని అన్నారు. తనను ఓడించాలని బీఆర్ఎస్ నేతలు మిడతల దండులాగా వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మంత్రులకు పక్క నియోజకవర్గాల మీద ఉన్న ప్రేమ తమ నియోజకవర్గాల మీద ఉండటం లేదన్నారు. ప్రశ్నించే గొంతును చట్టసభలోకి రాకుండా అడ్డుకోవడానికి భారీ కుట్రకు తెరలేపుతున్నారని విమర్శించారు.

కష్టం ఎక్కడున్నా సీతక్క అక్కడుంటుందన్నారు. ప్రజల్లో తనకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక టార్గెట్ చేస్తున్నారన్నారు. సీతక్క బాగా పనిచేస్తుందని అసెంబ్లీలో పొగుడుతున్నారని.. ఇక్కడికొచ్చి



ఓడిస్తామంటున్నారని అన్నారు. ఏం తప్పు చేశానని తనను టార్గెట్ చేస్తున్నారని.. ప్రజల మధ్యనే ఉండడం తాను చేస్తున్న తప్పా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులంతా దండయాత్రలు చేసి ములుగులో భయాందోళనకు గురిచేస్తున్నారంటూ సీతక్క విరుచుకుపడ్డారు.

## ఎన్నికల ముందే బీసీలు గుర్తొచ్చారా? కవితకు జీవన్‌రెడ్డి కౌంటర్



కరీంనగర్: బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవితకు జీవన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. "ఫాల్స్ హామీలు మావి కాదు.. మీవే. దళిత ముఖ్యమంత్రి హామీ ఇచ్చింది మీరే. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరులో మేము ఓట్లు అడగం. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లేని ఊర్లో మీరు ఓట్లు అడగద్దు. మీ కేబినెట్‌లో కూర్పు ఎలా ఉంది కవిత?. దళితులకు మీరు ఒక్క ఇల్లు అయినా కట్టించారా?, వాస్తవాలు చెబితే వినే ఓపిక లేదా?, మీ వైఫల్యాలను ఎత్తిచూపుతే ఎందుకు భయం. బీఆర్ఎస్, కేసీఆరే అసలైన దళిత ద్రోహి. ఎన్నికల ముందు నీకు బీసీలు గుర్తొచ్చారా?." అంటూ జీవన్‌రెడ్డి నిలదీశారు.

## పార్టీ మారడంపై ఎమ్మెల్యే రాజయ్య కీలక వ్యాఖ్యలు



హనుమకొండ: బీఆర్ఎస్ టికెట్ నిరాకరణ తర్వాత స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య తొలిసారిగా మాట్లాడారు. ఈ క్రమంలో పార్టీ మారడంపై ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు చేశారు. తన భవిష్యత్‌ను కాలమే నిర్ణయిస్తుందన్నారు. కేసీఆర్ టికెట్ ఇస్తారని ఆశిస్తున్నానట్లు తెలిపారు. టికెట్ రాకపోయినా ప్రజాజీవితంలోనే ఉంటానన్నారు. ఎమ్మెల్సీ, ఎంపీ పదవులు ఇస్తామని అంటున్నారని... కానీ తనకు ఎమ్మెల్యేనే కావాలని స్పష్టం చేశారు. పార్టీ మారడమా లేదా అనేది కాలమే నిర్ణయిస్తుందంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమంలో మాదిగల పాత్ర కీలకమైనదన్నారు. మాదిగల అస్థిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత కేసీఆర్ ది అని చెప్పుకొచ్చారు. తనకు టికెట్ రాకపోవడంపై మాదిగలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలో ఎక్కడికక్కడ సమావేశాలు పెట్టి మద్దతు తెలుపుతున్నారని అన్నారు. మందకృష్ణ మాదిగలాంటి వారు తనకు మద్దతు ఇస్తున్నారని ఎమ్మెల్యే రాజయ్య వెల్లడించారు.




హైదరాబాద్: శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. ఈ ఘటన సోమవారం ఉదయం జరగగా.. విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎయిర్‌పోర్ట్‌లో బాంబు పెట్టామని.. రాత్రి 7 గంటలకు అది పేలుతుందంటూ ఉదయం 11.50 గంటలకు ఓ వ్యక్తి కంట్రోల్ రూమ్‌కు మెయిల్ పంపాడు. దీంతో అప్రమత్తమైన బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో సీఐఎస్ఎఫ్, స్థానిక పోలీసులు ఎయిర్‌పోర్టు మొత్తం తనిఖీలు నిర్వహించారు. ఎయిర్‌పోర్టులో దిగిన విమానాల లగేజీ, ప్యాసింజర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. చివరకు ఎలాంటి బాంబు లేదని నిర్ధారించుకున్నారు. అయితే అక్కడికి కొద్దిసేపటికే మరో ఐడీతో ఎయిర్‌పోర్టు అధికారులకు ఇంకో మెయిల్ వచ్చింది. తప్పు జరిగిందని.. తన కుమారుడు ఫోన్‌తో ఆడుకుంటూ మెయిల్, సందేశాలు పెట్టాడని అజ్ఞాత వ్యక్తి అందులో పేర్కొన్నారు. తనను క్షమించాలంటూ కోరాడు. దీనిపై స్థానిక పోలీసులకు ఎయిర్‌పోర్ట్ అధికారులు ఫిర్యాదు చేశారు. మెయిల్ ఆధారంగా సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## ప్రాణం పోయినా ఆ రెండు పార్టీల్లోకి వెళ్లను: రాజాసింగ్

హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు భాజపా టికెట్ ఇవ్వకుంటే రాజకీయాలు వదిలేస్తానని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. స్వతంత్రంగా లేదా, ఇతర పార్టీల నుంచి పోటీ చేయనని స్పష్టం చేశారు. "ఎట్టిపరిస్థితుల్లోనూ సెక్యులర్ పార్టీల్లోకి వెళ్లను. ప్రాణం పోయినా భారాస, కాంగ్రెస్‌లో చేరను. గోషామహల్ భారాస టికెట్ మజ్లిస్ చేతిలో ఉంది. మజ్లిస్ నిర్ణయం కోసమే గోషామహల్ స్థానాన్ని కేసీఆర్ పెండింగ్‌లో పెట్టారు. భాజపా అధిష్ఠానం నాపై సానుకూలంగా ఉంది. సరైన సమయంలో నాపై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తారు" అని రాజాసింగ్ తెలిపారు.




**తోషాఖానా కేసులో శిక్ష నిలిపివేత –** ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్‌కు భారీ ఊరట లభించింది. తోషాఖానా కేసులో ట్రయల్ కోర్టు విధించిన మూడేళ్ల శిక్షను ఇస్లామాబాద్ హైకోర్టు నిలిపేసింది. తోషాఖానా అవినీతి కేసులో తనకు పడ్డ శిక్షను రద్దు చేయాలంటూ ఇమ్రాన్ దాఖలు చేసుకున్న పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. ప్రస్తుతం పంజాబ్ ప్రావిన్స్‌లోని అటక్ జిల్లా జైలులో ఇమ్రాన్ శిక్ష అనుభవిస్తున్నారు. ఈ కారాగారంలో వసతులపై తరచూ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో.. ఆయనకు తాజాగా కొన్ని అదనపు సౌకర్యాలు కల్పించారు.

## బడుగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న బీఆర్ఎస్ : ప్రభుత్వ విప్ సునీతా మహేందర్ రెడ్డి



యాదాద్రి భువనగిరి : బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆలేరు పట్టణంలో వైఎస్సార్ గార్డెన్లో బీసీ బంధు పథకం కోసం ఎంపిక చేసిన 300 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. చేతి వృత్తి దారులకు చేయూతనిస్తూ ఉపాధి కల్పిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. మళ్లీ ఆ పార్టీకి ఓటేస్తే ప్రజల జీవితాలు చీకట్లోనే మగ్గాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ సందీప్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మహేందర్ రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.




## జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఉద్రిక్తత

హైదరాబాద్: జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బల్దియా కాంట్రాక్టర్లు జీహెచ్ఎంసీ కార్యాలయ ముట్టడికి యత్నించారు. సుమారు 1000 కోట్ల మేర బిల్లులు చెల్లించాలని ఆందోళనకు దిగారు. బల్దియా ముట్టడికి కాంట్రాక్టర్లు, వారి కుటుంబ సభ్యులతో సహా వచ్చారు. పోలీసులు కాంట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలిస్తున్నారు.

## బీసీ బంధు అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల కోసమే

బోయినపల్లి: బీసీ బంధును సీఎం కేసీఆర్ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల కోసమే తెచ్చారని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం నాడుబీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఎంపీ లక్ష్మణ్, ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఈటల మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ఉన్నప్పటికీ.. కేసీఆర్ దాన్ని చెత్తబుట్టలో వేశారని మండిపడ్డారు. ఎంబీసీ కోసం పెట్టిన నిధులు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదన్నారు. రైతు బంధులు ప్రకటించి పాలభిషేకం చేయించుకోవడం కాదు. వారి బతుకుల్లో మార్పు తీసుకురావాలని సూచించారు. ఎన్నికల కోసం అలవికానీ హామీలు ఇవ్వవద్దని హితవు పలికారు.



కేసీఆర్ పోటీచేసే స్థానాల్లో బీజేపీ బలమైన అభ్యర్థులను నిలబెడుతుందని చెప్పారు.కేసీఆర్‌ను ఓడించి తీరుతామని ఈటల రాజేందర్ చెప్పారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com